





ఉల్లి..లొల్లి!

రైతు బజార్లలో మోళీ సాగుతూనే ఉంది.. అయినా అధికారులకు పట్టడంలేదు.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో కర్నూలు ఉల్లిపాయలనే విక్రయిస్తున్నారు. కేవలం రూ.11లే ఉన్నా ఈ ఉల్లిపై ఆసక్తి ఉండదు. మహారాష్ట్ర ఉల్లిపాయల వినియోగంపైనే ఆసక్తి చూపుతారు. ఆ ఉల్లిపాయల నుంచి లాభం తక్కువగా ఉండడంతో కేవలం కర్నూలు ఉల్లినే రైతు బజార్లలో ప్రజలకు అంటగట్టేస్తున్నారు.

6



రెండో సారి..11 బార్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బార్లకు మళ్లీ లాటరీ నిర్వహించారు. జిల్లాలో గురువారం 11 బార్‌లను కేటాయించారు. వీటిలో రాజమహేంద్రవరం సిటీలో 9, కడియపులంక, నిడదవోలులో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. జిల్లాలో మొత్తం 25 బార్‌లకు మొదటి నోటిఫికేషన్ ఇచ్చాయి. అయితే దరఖాస్తులు అంతంతమాత్రంగానే వచ్చాయి.తొలి దశ నిర్వహించిన లాటరీలో కేవలం 9 బార్‌లకు అనుమతినిచ్చారు.మిగతా వాటికి రెండో నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో 11 బార్‌లకు 44 దరఖాస్తులు అందాయి.ఈ మేరకు గురువారం సబ్-కలెక్టర్ కృష్ణ నాయక్ లాటరీ తీశారు. బార్‌లకు దరఖాస్తులు రావడంలో ఇబ్బందులను పరిష్కరించే నివేదికను సమర్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.అనుకూలమైన నిర్ణయం తీసుకుంటారనే ఉద్దేశంతో బార్ వ్యాపారులు ముందుకు వచ్చారు. మిగతా 5 బార్‌లకు మళ్లీ నోటిఫికేషన్ పిలిచే అవకాశం ఉంది.

అదిరిన.. పోలీస్ భోజనం!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు మారుతున్నారు.. జనాలకు చేరువ అవుతున్నారు.. ఫ్రెండ్లీ పోలీస్‌కి బాటలు వేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయం, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం భారీ అన్న సంతర్పణ చేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ విచ్చేసి పలువురికి స్వయంగా వడ్డించారు. అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనదని చెప్పారు. మన సంస్కృతి గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేస్తుందన్నారు. బిరియానీ, పెరుగుచట్నీ, పులిహోర, స్వీటు, బూరె, రెండు కూరలు, సాంబారు, అన్నం తదితర రకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానం కార్యక్రమం మొత్తం పోలీసులే వడ్డన చేయడం గమనార్హం. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీ కృష్ణ, త్రీటౌన్ సీఐ అప్పారావు, వన్‌టౌన్ సీఐ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యూరియాపై విజిలెన్స్!

యూరియా అక్రమ దందాకు అడ్డుకట్ట

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

యూరియాపై భిన్నవాదనలు.. అధికారులు కొరత లేదంటున్నారు.. రైతులు కొరత అంటూ ఆందోళన చెందుతున్నారు. అవసరానికి సరిపడా పంపిస్తున్నామని ప్రభుత్వం గణాంకాలతో సహా చెబుతోంది. అయితే రైతులు మాత్రం అడపాదడపా ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ రంగంలోకి దిగింది. యూరియా పంపిణీ చేస్తున్న ఆర్ఎస్‌కే, సొసైటీలు, ఎరువుల షాపులపై నిఘాపెట్టింది. కొరత లేనప్పటికీ సమస్య ఎక్కడ ఉత్పన్నమవుతుందనే విషయాన్ని నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమైంది. గత నెల 23న విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, రిటైల్ షాపుల్లో మూడు జిల్లాల్లో మూడు ప్రత్యేక బృందాలు నిరంతరం సంచరిస్తూ తనిఖీలు చేస్తున్నాయి. రికార్డులు సరిగా లేకపోయినా, నిల్వ, అమ్మకానికి పొంతన కుదరకపోయినా కేసులు నమోదు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ వరకూ 99 తనిఖీలు చేసి 6(ఏ) కేసులు 16 నమోదు చేశారు. మూడు జిల్లాల్లో రూ.99.59 లక్షలు విలువైన 318 టన్నుల ఎరువులు సీజ్ చేశారు. వీటిలో 130 టన్నుల యూరియా ఉంది. రికార్డులు సక్రమంగా లేని 31 కేసుల్లో రూ.2 కోట్ల విలువైన 722 టన్నుల యూరియా విక్రయాలు నిలుపుదల చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలో తాజాగా విజిలెన్స్, వ్యవసాయాధికారుల తనిఖీల్లో రెండు లారీల్లో అక్రమంగా తెచ్చిన 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

సీజ్ చేస్తున్నారు.. తరలించేస్తున్నారు!

గతంలో సీజ్ చేసిన ఎరువులను కేసు పరిష్కారం కాబడే వరకూ రిలీజ్ చేయడం జరిగేది కాదు. దీంతో నెలల తరబడి ఎరువులు గోదాముల్లో ఉండేవి. ఇప్పుడు యూరియా సీజ్ చేస్తే 24 గంటల్లో అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు.

- మూడు జిల్లాలకు 3 టీమ్‌లు ఏర్పాటు
- 99 చోట్ల తనిఖీలు.. 16 కేసులు నమోదు
- రూ.99.59 లక్షల విలువైన ఎరువులు సీజ్
- గొల్లప్రోలు మండలం 548 బస్తాలు పట్టివేత


గొల్లప్రోలు మండలంలో సీజ్ చేసిన రెండు లారీలు

సమస్య ఉంటే డయల్ 80082 03262



యూరియా సరఫరాపై అప్రమత్తంగా ఉన్నాం. విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేసి అక్రమాలపై కేసులు పెడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు విక్రయించడం తదితర అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే 80082 03262 నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

- స్నేహిత, విజిలెన్స్ అధికారి, ఉమ్మడి తూర్పుగోదావరి

అక్రమ దందా..అడ్డంగా చిక్కారు!

- అక్రమ మార్గాల్లో యూరియా
- బ్లాక్‌మార్కెట్‌లో బస్తా రూ.400
- నలుగురిపై కేసు..అరెస్టు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియాపై ప్రభుత్వం, అధికారులు ఎంత నిఘా ఉంచినా అక్రమ మార్గాల్లో తరలిపోతోంది. ఇతర ప్రాంతాల నుంచి యూరియాను లారీల్లో తెచ్చి బ్లాక్‌మార్కెట్‌కు తరలించి బస్తాపై అదనంగా రూ.400-500 వరకూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎరువుల డీలర్లు గ్రామాల్లోకి నేరుగా లారీలు తెచ్చి విక్రయాలు సాగిస్తున్నారు.గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, షాపులకు రావాల్సిన నిల్వలు పక్కదోవ పట్టిస్తున్నారని అందిన ఫిర్యాదులపై విజిలెన్స్ సీఐ ఐ.గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తనిఖీలు చేపట్టారు. తాటిపర్తి గ్రామ శివారులో వన్నెపూడి రోడ్డులో యూరియా లోడుతో రెండు లారీలను గుర్తించి విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే ర్యాక్ నుంచి 450 బస్తాల ఎన్ఎఫ్ఎల్ యూరియా తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్‌కు లారీలో తెచ్చారు. అయితే షాపు నిర్వాహకుడు సదరు లారీని షాపు వద్దకు రానివ్వకుండా వేరే ప్రాంతంలో నిలపమని చెప్పి ఆటోలు, మోటార్ సైకిళ్ల ద్వారా 127 బస్తాల యూరియా తరలించినట్టు లారీ డ్రైవర్ తెలిపారు. మరో లారీలో 450 బస్తాల యూరియాను ద్వారపూడి రైల్వే వేగన్ నుంచి తాటిపర్తిలోనే నాగదుర్గా ఏజన్సీస్‌తోపాటు దుర్గా సరస్వతి ట్రేడర్స్‌కు తీసుకువచ్చారు. ఇందులో 225 బస్తాల వంతున రెండు షాపులకు తీసుకోవాలని చెప్పారని లారీ డ్రైవర్ తెలిపారు. నాగదుర్గా ఏజన్సీస్‌కు వచ్చిన స్టాకును వన్నెపూడిలో రోడ్డుపై నిలిపి రూ.400 వంతున విక్రయించినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. తాటిపర్తి డీలర్లకు ఈ స్టాకు హోల్‌సేల్ డీలర్లుగా ఉన్న సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం లక్ష్మీ కల్యాణి ఎంటర్‌ప్రైజెస్, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఏజన్సీస్ నుంచి పంపినట్టు గుర్తించారు. యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించి రెండు లారీలతోపాటు 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకున్నారు. వీరు తనిఖీలు చేస్తున్న సమయంలోనే ఈ పోస్ మిషన్ ద్వారా నాగదుర్గా ఏజన్సీస్ ప్రతినిధి రైతుల వేలి ముద్రలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా సదరు మిషన్‌ను సైతం సీజ్ చేశారు. వీటిని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు. విజిలెన్స్ వ్యవసాయాధికారుల తనిఖీలు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ కొనసాగాయి.

నలుగురి అరెస్టు

యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయించడం, ఈపోస్ యంత్రాలను దుర్వినియోగం చేసి రైతుల వేలి ముద్రలు సేకరించి తప్పుడు రికార్డులు సృష్టించేందుకు ప్రయత్నించడం తదితర అంశాలపై ఏవో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు రెండు కేసులు రిజిస్టర్ చేశామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్ నిర్వాహకుడు దాసం శ్రీనివాస్, హెల్పర్ కర్రెడ్ల కనక వీరబాబు, మండపేట మండలం ద్వారపూడికి చెందిన డ్రైవర్లు కొటారి వీరబాబు, గుత్తుల దుర్గారావులపై కేసు నమోదు చేశామని, వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

బుధవారం లైసెన్స్ రద్దు చేసినా..

తాటిపర్తిలోని నాగదుర్గా ఏజన్సీస్‌కు 30 టన్నుల యూరియా రాగా, దానిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో వ్యవసాయాధికారి సత్యనారాయణ బుధవారం తనిఖీలు చేసి దగ్గరుండి ఎమ్మార్పీ ధరలకు విక్రయించడంతోపాటు లైసెన్స్ రద్దు చేశారు. అయినా లెక్క చేయకుండా యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం గమనార్హం.


దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలపై ఆరా తీస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

అందుబాటులో యూరియా : కలెక్టర్

కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలను గురువారం పరిశీలించారు. ఇటీవల యూరియా సరఫరాపై రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు రైతులతో సమావేశమయ్యారు. వివిధ పంటల్లో యూరియా వాడకం,పంటల దిగుబడులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. జిల్లాలో యూరియా కొరత లేదని,రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. రైతులకు అవసరమైనంత సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. శాస్త్రీయ పద్ధతిలో అధికారులు సిఫారసు చేసిన మోతాదులోనే యూరియా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఎస్ఐ అరెస్టు



కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బు లు వసూలు చేస్తున్న నకిలీ ఎస్ఐను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లి గ్రామానికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐషర్ వ్యాన్‌పై ఈ నెల 16వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలో ఒక మాల్ వద్దకు వచ్చి వాషింగ్ పౌడర్ లోడ్ దిగుమతి చేసి వెళుతూ కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్టలోని జియో పెట్రోల్ బంకు వద్ద నిద్రకు ఉప క్రమించాడు. 17వ తేదీ ఉదయం ధవళేశ్వరం ఎఫ్‌సీఐ గొడౌన్స్ ప్రాంతం లోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సరేళ్ళ సంజయ్‌రాజు హోండాషైన్ బైక్‌పై పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పట్టుకుని వచ్చి రోడ్డు ప్రక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు చూపించమన్నాడు. రికార్డు చూసి సరిగాలేదని డ్రైవర్ సంతోష్‌ను బెదిరించి స్టేషన్‌కు పద అని కొంత దూరం తీసుకెళ్లి రూ.2 వేలు నగదు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరువైపు వెళ్లిపోయాడు. వ్యాన్ డ్రైవర్ సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.డీఎస్పీ దేవకుమార్, సీఐ కె.విజయబాబుల పర్యవే క్షణలో నకిలీ ఎస్ఐ సంజయ్‌రాజును గురువారం పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. సంజయ్‌రాజుపై గతంలో రాజమహేంద్రవరం-1,3 రాజానగరం, రావులపాలెం, శ్రీకాకుళం, ఏఆర్ పురం ప్రాంతాల్లో పలు కేసులున్నట్టు సమాచారం.

వాడపల్లి ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు



ఆత్రేయపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాలకు చైర్మన్లను ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు విధేయుడిగా ఉన్న ఆత్రే యపురం గ్రామానికి చెందిన మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజును నియామకానికి బండారు కృషిచేశారు.అక్టోబరు 10 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించే స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందే ధర్మకర్తల మండలి కొలువుదీరనుంది. 17 మంది ధర్మకర్తలతో నూతన పాలకవర్గం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులతో ఏర్పడుతుందని చెబుతున్నారు. మంచి ముహూర్తం నిర్ణయించుకుని పాలక మండలి ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించనున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ రెన్యువల్‌కి 30 వరకూ అవకాశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) 2021, 2022, 2023, 2024 డిసెంబరు 8న జరిగిన పరీక్షల ద్వారా ఎంపికైన విద్యార్థులు www.scholarships.gov.in పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 30 వరకూ గడువు పొడిగించడం జరిగిందని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. ఈ ఏడాది 10, ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లోని విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అధ్యక్షా.. విన్నారా!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆం ధ్రజ్యోతి) : అధ్యక్షా..! మా సమస్యలివీ పరిష్క రించాలంటూ జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యే లు గొంతెత్తారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభమైన గురువారం జిల్లా నుంచి ము గ్గురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లభించింది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమ హేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ క్వశ్చన్ అవర్‌లో పలు సమస్యలు లేవనెత్తారు. ఎవరెవరు ఏం మాట్లాడారంటే..

- అసెంబ్లీలో తూరుపు వాణి
- గొంతెత్తిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- క్వశ్చన్ అవర్‌లో అవకాశం
- టిడ్కో ఇళ్లు ఇవ్వాలి : గోరంట్ల
- సొసైటీలపై నిఘా ఉండాలి : వాసు
- సోలార్ స్కీమ్ ఉపయోగం : బత్తుల

సూర్యఘర్‌కు బ్యాంకర్లు సహకరించడంలేదు!

సోలార్ విద్యుత్ ప్రాజెక్టు చాలా మంచిది. దీని వల్ల కాలుష్యం కంట్రోల్ అవుతుంది. కానీ ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల సూర్యఘర్ పథకం ముందుకు వెళ్లడంలేదు. నా నియోజకవర్గంలో 98 వేల ఇళ్లు ఉండగా కేవలం 180 రిజిస్ట్రేషన్లే జరిగాయి. ప్రత్యేక టీమ్‌లతో ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ స్కీమ్ అమలుకు బ్యాంకర్లు సహకరించడం లేదు. లబ్ధిదా ర్లకు రుణాలివ్వడానికి ముందుకు రావడంలేదు. ప్రభుత్వం బ్యాంకర్లతో చర్చించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాలకు ఉచిత స్కీమ్‌లో సోలార్ విద్యుత్ కల్పిస్తే,విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది.

- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే రాజానగరం

టిడ్కో ఇళ్లను కేటాయించండి



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో 5 లక్షల టిడ్కో ఇళ్లలో 2.5 లక్షల ఇళ్లను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని.. గతంలో చంద్రబాబు ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన మరో 2.5 లక్షల ఇళ్లలో ప్రస్తుతం 50 వేల మంది కూడా నివసించడం లేదన్నారు. నేను టిడ్కో ఇళ్ల పరిశీలనకు వెళ్లినప్పుడు రెండు పెద్దపెద్ద పాములు ఆ ఇళ్లలోకి వెళ్లాయి.మరో పక్క జగన్ హయాంలో ఆ ఇళ్లపై తీసుకున్న రుణాల వల్ల బ్యాంకర్లు ఇళ్లకు తాళాలు వేసుకుంటున్నారని.. కనీసం ఇంట్లోకి వెళ్లకుండానే లబ్ధిదారుల కు బ్యాంక్‌లు నోటీసులిచ్చి ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, బ్యాంకర్లతో మా ట్లాడి..ఇళ్లకు తాళాలు వేయ కుండా చూడాలని కోరారు.తక్షణమే సంబంధిత మం త్రిగారు స్పందించి వసతులు కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యల వివరాలన్నీ రికార్డు చేయాలని,వాటికి పరిష్కారం చూపవలసిన అవసరం ఉం దన్నారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇది మంచి సూచనగా చెప్పడం గమనార్హం. జీఎస్టీ తగ్గింపుపై కూడా మాట్లాడారు.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే రాజమహేంద్రవరం రూరల్

సొసైటీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి



మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీల్లో డబ్బులు దాచుకుని చాలా మంది మోసపోతున్నారని.. ఇటువంటి వాటిపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి.జయలక్ష్మీ కోఆపరేటివ్ సొసైటీ వల్ల రాజమహేంద్రవరం, కాకినాడలలో అనేక మంది అనేక మంది మోసపోయారు. సొసైటీలపై ప్రభుత్వం ఆడిట్‌గానీ, తనిఖీలు కానీ చేసే అధికారం లేనందువల్ల ఎవరికి వారు సొంతంగా ఆడిట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పేద , మధ్య తరగతి ప్రజలు ఎక్కువ వడ్డీ ఆశతో ఇటువంటి సొసైటీలు, బ్యాంకుల్లో పెడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు.ఇటువంటి సొసైటీల లెక్కలను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేసేలా సంబంధిత మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పుల వల్ల స్పెషల్ విజిట్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియన్ హై కమిషన్ ఆయనను ఆహ్వానించి, అరుదైన గౌరవం ఇచ్చింది. 2001 లో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీకి మాత్రమే ఈ అరుదైన గౌరవం దక్కింది. - ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమహేంద్రవరం సిటీ


పెద్దేవంలో బాధిత రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చిత్రంలో ఆర్డీవో రాణిసుస్మిత తదితరులు

పెద్దేవంలో గేదెల రక్షణకు చర్యలు

- మరికొన్ని ల్యాబ్‌లలో పరీక్షలు
- తాగునీటిపై నివేదిక ఇవ్వండి
- కలెక్టర్ కీర్తి చేకూరి

తాళ్లపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని చూడి పశువులు, ఈనిన గేదెలను గుర్తించి యుద్ధప్రాతిపదికన వాటిని కాపాడాలని పశు సంవర్ధక శాఖా సిబ్బందికి కలెక్టరు కీర్తి చేకూరి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెల వరుస మరణాలపై కలెక్టర్ స్పందించి గురువారం జమ్ముల శ్రీను, గెడ్డం మణికంఠ నివాసాల వద్ద వ్యాధి బారిన పడిన గేదెలను పరిశీలించి రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో పశువులకు చికిత్స కొసాగింపు కొనసాగుతుందని.. ఈ మేరకు ప్రత్యేక వైద్య బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిందన్నారు. గేదెల వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని.. రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బి.కోలి, పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. మరికొన్ని ల్యాబ్‌ల నుంచి రెండు మూడు రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. పశువైద్య జీవ విజ్ఞాన పరిశోధన సంస్థ (వీబీఆర్ఐ) ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో పశువుల చికిత్సవ్యాధి తీవ్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్షించడం జరిగిందన్నారు. పెద్దేవంలో బుధవారం రైతు జొన్నలగడ్డ సత్యనారాయణకు చెందిన గేదె మృతి చెందగా గురువారం శవ పరీక్షలు చేపట్టి.. నమూనాలను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ పంపించారన్నారు.చనిపోయిన గేదెల యజమానుల నివాసాల వద్ద.. గ్రామంలో నీటిని క్షుణ్ణంగా పరిశీలించి రేపటిలోగా నివేదికలు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నూర్జహాన్‌కు సూచించారు. అనంతరం రైతులు ప్రభుత్వం నుంచి గేదెల కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలోని సుగంధి చెరువు శుభ్రం చేయించాలని కోరగా కలెక్టరు పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో రాణీ సుస్మిత, వీబీఆర్ఐ విజయవాడ కేంద్రం జేడీ డా చంద్రమౌళి, సహాయ సంచాలకులు డా.శిరీష, జిల్లా పశుసంవర్ధక శాఖా అధికారి డా. శ్రీనివాస్, డిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంగిడిలోనూ వ్యాధి లక్షణాలు

కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలంలో ఇటీవల పాడిగేదెలు బి.కోలి, పొట్ట జలగ వ్యాధితో మృతి చెందుతున్నాయని, అవే లక్షణాలు కొవ్వూరు మండలం పంగిడిలో కనిపిస్తున్నాయని తెలియడంతో పరిశీలించడం జరిగిందని కలెక్టర్ కీర్తి తెలిపారు. విజయవాడకు చెందిన పశువైద్య జీవ విజ్ఞాన పరిశోధన సంస్థ (వీబీఆర్ఐ) బృందంతో వ్యాధి తీవ్రత, చికిత్సకు సంబంధించి సమీక్షించామన్నారు.జేడీ డా.చంద్రమౌళి ఆధ్వర్యంలో శవ పరీక్షలు చేపట్టామన్నారు.

ఆర్థిక సాయం పొందాలంటే..



- ఆటో కార్మికులు ఈ నిబంధనలు పాటించాల్సిందే
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు
- రవాణా శాఖకు 24న అందనున్న తుది జాబితా
- అక్టోబరు 1న బ్యాంకు ఖాతాలకు చేరనున్న ఆర్థిక సాయం
- సచివాలయాలకు క్యూలు కడుతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్ కార్మికులు

– అమలాపురం, సామర్లకోట/ఆంధ్రజ్యోతి

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలకు విజయదశమి పర్వదినం రోజైన అక్టోబరు 2 నుంచి అందించనున్న ఆర్థిక సహాయం కోసం అర్హులైన ఆటో కార్మికులు దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయాల వద్ద క్యూలు కడుతున్నారు. రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని గత నెల 15వ తేదీ నుంచి అమలులోకి తీసుకురావడంతో ఆటో కార్మికుల జీవనోపాధిపై ప్రభావం తీవ్రంగా పడింది. దీని ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపడుతున్న నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల అనంతపురంలో జరిగిన సూపర్-6 సక్సెస్ సభలో ఆటో కార్మికుల కుటుంబానికి ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.15వేల వంతున ఆర్థిక సహాయాన్ని అక్టోబరు 2 నుంచి అందజేస్తారని ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో రోడ్లు, ట్రాన్స్‌పోర్టు శాఖ ఇటీవల కొన్ని మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఎంఎస్ నంబరు 33లో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర సౌకర్యాన్ని కల్పించేందుకు విధివిధానాలను రూపకల్పనచేసి ఉత్తర్వులు విడుదల చేసింది. ముఖ్యంగా ఆటోరిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఈ పథకం కింద ప్రభుత్వం రూ.15 వేలు వంతున ఆర్థిక సహాయం అందజేయనుంది. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయంతో ఆటోలకు బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ఈ సహాయం అందే

నిబంధనలు ఇలా..

- జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.
- ఈ పథకం కింద అర్హత పొందేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ పొందిన ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌లకు అర్హత ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్సులు కూడా ఉండాలి.
-ఏపీలో జారీచేసిన ఆటోరిక్షా లైట్ మోటారు వాహనాన్ని నడపడానికి చెల్లుబాటయ్యే లైసెన్సు ఖచ్చితంగా ఉండాలి. ఏపీలో రిజిస్టర్ అయిన వాహనం అయి ఉండాలి. మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఖచ్చితంగా ఉండాలి. ఆటో రిక్షా విషయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా, 2025-26 సంవత్సరానికి అనుమతిస్తారు. ఒక నెలలోపు ఆ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.
- ప్యాసింజర్ ఆటో రిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ యజమానులకు వర్తిస్తుంది. బీపీఎల్‌కు దిగువన ఉండాలి. ఖచ్చితంగా రేషన్‌కార్డు కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు లేదా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్‌గా ఉంటే అనర్హులు. పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది.
- ఇంటి విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల కంటే తక్కువగా ఉండాలి.
- దరఖాస్తు తేదీకి ముందు 12 నెలలు సగటున లెక్కిస్తారు.
- సదరు వాహనంపై ఎలాంటి పెండింగ్ బకాయిలు, చలానాలు ఉండకూడదు.
- ఆటో కార్మికుడు మాగాణి అయితే మూడు ఎకరాలు, మెట్ట అయితే పది ఎకరాల్లోపు ఉండాలి.
- పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకంటే ఎక్కువ నివాసం, వాణిజ్య భవనాలు ఉండకూడదు.
- కొత్త దరఖాస్తులు స్వీకరణ.. ఈనెల 15 నాటికి వాహనాల జాబితా, రిజిస్ట్రేషన్ నంబరు, యజమాని పేరు, చిరునామా, ఫోన్ నంబరుతో కూడిన వివరాలను ప్రభుత్వం జీఎస్‌డబ్ల్యూఎస్‌కు అందిస్తోంది.
- తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా 2023-24లో ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారుల వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా విశ్లేషిస్తారు.
- కొత్త లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19 వరకూ మాత్రమే అవకాశం ఉంది. 22 నాటికి సచివాలయం, మండల, జిల్లా స్థాయి క్షేత్ర పరిశీలన పూర్తిచేస్తారు. తుది జాబితా 24కి సిద్ధం చేస్తారు.
- లబ్ధిదారుల జాబితాను కార్పొరేషన్‌ల వారీగా జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం 24 నాటికి రవాణా శాఖకు పంపుతుంది.
- ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 1న బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.





వికసించిన 11 బ్రహ్మకమలాలు

అంబాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరుదుగా లభించే పుష్పాల్లో బ్రహ్మకమలాలు ఒకటి. బ్రహ్మకమలాలు వికసించిన ఆ ఇంట మంచి జరుగుతుందని ప్రజల విశ్వాసం. శివునికి అత్యంత ప్రీతికరమైన బ్రహ్మకమలాలు అంబాజీపేట వీరభద్ర థియేటర్ సమీపంలోని బిక్కిన్న వీరన్న ఇంటిలో సుమారు 11 బుధవారం అర్ధరాత్రి వికసించాయి. మంచి సువాసన కలిగిన అందంగా ఉన్న పుష్పాలు అందరినీ అబ్బురపరిచాయి.



– కాకినాడ కార్పొరేషన్/ఆంధ్రజ్యోతి



ఉచిత శిక్షణతో.. ఉపాధ్యాయ కొలువులు

- బడుగు, బలహీనవర్గాల యువతకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం
- సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థిక సహకారంతో 260 మందికి శిక్షణ.. 60 మందికి ఉద్యోగాలు
- వీరందరికీ కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ
- ఇతర సంస్థల సాయంతో ఆన్‌లైన్‌లో వేలాది మందికి శిక్షణ.. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు

రాష్ట్రప్రభుత్వం ఈసారి మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నోటిఫికేషన్, ఖాళీ పోస్టుల భర్తీకే పరిమితం కాలేదు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎంతో కష్టపడి చదివి, ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచింది. ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి వీలుగా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఏర్పాటుచేసింది. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు పోటీ పరీక్షా కేంద్రాల్లో తర్ఫీదు పొందుతున్న తరుణంలో పేద, బలహీనవర్గాల వారినీ అదే స్థాయి శిక్షణ పొందేలా ప్రైవేటు పోటీ పరీక్షా కేంద్రంలో చేర్పించి శిక్షణ ఇప్పించింది. ఆ ఫలితం ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిలో స్పష్టంగా కనిపించింది. కాకినాడ విద్యుత్‌నగర్ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో సోషల్ వెల్ఫేర్‌శాఖ ద్వారా 260 మంది ఆఫ్‌లైన్ విధానంలో హాస్టల్, భోజన,వసతితో శిక్షణ పొందారు. ఒక్కో అభ్యర్థికి ప్రభుత్వం ఫీజు కింద ఎస్‌జీటీకి రూ.10వేలు, ఎస్ఏకి రూ.12వేలు చొప్పున చెల్లించింది. స్టడీ మెటీరియల్‌కు రూ.3 వేలు, భోజన ఖర్చులు(డైట్) మూడు నెలల కాలానికి రూ.13,500 చొప్పున ఇచ్చారు. ఇక్కడ తర్ఫీదు పొందిన వారిలో 60 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికవడం విశేషం. కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 651 మందికిగాను 54 మంది, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 601మందికిగాను 45 మంది, బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 4820 మందికి గాను 246 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ప్రభుత్వ సాయంతో శిక్షణ పొంది ఉపాధ్యాయులైన వారి మాటల్లో..

తండ్రి ఆశయం నెరవేర్చాను



నాది నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితి గట్టెక్కాలంటే ఉద్యోగం సాధించడమే ఏకైక మార్గమని నా తండ్రి చెప్పేవారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ ఉచిత శిక్షణ పొందాను. ఇక్కడ ఇచ్చిన శిక్షణ, హాస్టల్, భోజన వసతులు బాగున్నాయి. రోజువారీ, వారాంతపు టెస్టులు మా విజయంలో ముఖ్య భూమిక పోషించాయి. దీంతో ఎస్టీ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించడంతో పాటు ఎస్జీటీలో కూడా ఉద్యోగం పొంది నా తండ్రి ఆశయాన్ని నెరవేర్చాను.

- డి.బాలునాయక్, డీఎస్సీ ఎస్టీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, కర్నూలు జిల్లా

స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తోపాటు టీజీటీలోనూ ఉద్యోగం సాధించా



అమ్మా, నాన్న కూలి పని చేస్తారు. ఇంతవరకు వారిపైనే ఆధారపడుతూ వచ్చాను. ప్రభుత్వం కల్పించిన డీఎస్సీ ఉచిత శిక్షణ నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఇక్కడ అధ్యాపకుల బోధన ఎంతో ఉపయోగపడింది. ఎస్సీ (గ్రూప్-1) కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు టీజీటీ (సోషల్)లో కూడా ఉద్యోగం సాధించగలిగాను. **- యం.డేనియల్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా**

కల నెరవేరింది



మా నాన్న వ్యవసాయ కూలీ. నేను టీచర్ ఉద్యోగం సాధించాలని కలలు కనేవాడిని. అందుకోసం బీఎస్సీ, డీఈడీ చదివాను. కుటుంబ కష్టాల కారణంగా శిక్షణ తీసుకోవడం కుదిరేదికాదు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత హాస్టల్ వసతితో కూడిన శిక్షణను సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఇస్తోందని తెలుసుకుని శ్యామ్ ఇనిస్టిట్యూట్‌ను ఎంచుకున్నాను. అధ్యాపకులు నా విజయంలో కీలకపాత్ర పోషించారు. **- జి.ప్రేమ్‌కుమార్, పశ్చిమ గోదారి జిల్లా**

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మాది బడ్డీ కొట్టు. కోచింగ్ తీసుకోవడానికి ఆర్థిక స్తోమత సరిపోలేదు. ఇటువంటి సమయంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్ ఇప్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మూడు నెలలపాటు తీసుకున్న శిక్షణ మా కష్టాలను తీర్చింది. ఇక్కడ పక్కా ప్రణాళికతో శిక్షణ ఇచ్చారు. మాకు చాలా అప్పులు ఉన్నాయి. టీచర్ ఉద్యోగం సాధించడం వల్ల నాకు ధైర్యంగా ఉంది. **- కె.బ్రజేష్, కృష్ణా జిల్లా**

తక్కువ సమయంలోనే సిలబస్ పూర్తి



సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందించిన శిక్షణ చాలా ఉపయోగపడింది. అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో తక్కువ సమయంలోనే సిలబస్ పూర్తి చేశారు. టెస్టులు, వాటి వివరణ హైలెట్. ఎస్టీ కేటగిరీలో ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది.

- ఎం.శరత్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా

నా జీవితాన్ని మలుపు తిప్పింది



మాది నిరుపేద కుటుంబం. మా చిన్నాన్న ప్రోద్భలంతో ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనుకున్నా. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా శిక్షణకు ఎంపిక కావడం నా జీవితాన్ని మలుపు తిప్పింది. అనుకున్నది సాధించాను.

- ఎన్‌పీఎస్ లక్ష్మయ్య, కర్నూలు జిల్లా

షోలాపూర్ ఉల్లికి నో ఎంట్రీ



షోలాపూర్ ఉల్లిపాయలు

- రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలో కిలో రూ.11కు కర్నూలు ఉల్లి విక్రయాలు
- మరో వారం పరిస్థితి ఇంతే
- హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర పాయలు కిలో రూ.15-రూ.16



కర్నూలు ఉల్లిపాయలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో మహారాష్ట్ర షోలాపూర్ ఉల్లిపాయల విక్రయాలు నిలిపివేశారు. వీటికి బదులుగా కర్నూలు రకం ఉల్లిపాయలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కర్నూలు ప్రాంత ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో జిల్లాలోని రైతుబజార్ల ద్వారా వీటి విక్రయాలు చేపడుతున్నారు. కర్నూలు పాయలకు మార్కెట్ కోసం అన్ని రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లి విక్రయాలను పూర్తిగా నిలిపివేశారు. కర్నూలు రకం ఉల్లిని రైతు బజార్లలో కిలో రూ.11కే విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలో రూ.10కే విక్రయించారు. వాస్తవానికి జిల్లావాసులు మహారాష్ట్ర ఉల్లిపాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. రేటు రూపాయి ఎక్కువైనా మహారాష్ట్ర ఉల్లినే కొంటారు. మహారాష్ట్ర ఉల్లితో పోల్చితే కర్నూలు ఉల్లి రంగు, నాణ్యతలో అంతంతమాత్రం కావడమే దీనికి కారణం. దీంతో రైతు బజార్లలో రెండు రకాలు పెడితే కర్నూలు ఉల్లికి మార్కెట్ ఉండదనే కారణంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నో ప్రాఫిట్-నో లాస్ తరహాలో రైతుబజార్లలోని వ్యాపారులు ఈ ఉల్లిని విక్రయిస్తున్నారు. లాభం లేకపోవడంతో ఉల్లి వ్యాపారుల్లో కొంత అసంతృప్తి ఉన్నా అమ్మాల్సిందేనంటూ పై అధికారుల నుంచి ఒత్తిడి ఉండడంతో నోరు మెదపడం లేదు. మహారాష్ట్ర ఉల్లిపాయల ధర బహిరంగ చిల్లర మార్కెట్లలో రూ.25-30 ఉంది. తోపుడు బండ్లు, ఆటోల్లో ఇళ్లకు తీసుకొచ్చి విక్రయించేవాళ్లు మీడియం రకాలను ఆరు కిలోలు రూ.100కు ఇస్తున్నారు. కర్నూలు ఉల్లి తక్కువ ధరకే దొరికినా సాధారణ, దిగువ మధ్య తరగతి ప్రజలు ఒకటి, రెండు కిలోల కంటే ఎక్కువ కొనుగోలు చేయరని, మధ్య తరగతి, సంపన్న వర్గాలు మహారాష్ట్ర ఉల్లిపాయలనే కొంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హోల్‌సేల్‌లో మహారాష్ట్ర నెం.1 ఉల్లిపాయలు కిలో రూ.15-రూ.16

హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర నెం.1 పాయలు కిలోరూ.15, రూ.16 ఉన్నాయి. వీటిని బహిరంగ మార్కెట్లో చిల్లర వ్యాపారులు రూ.25-30 వరకు అమ్ముతున్నారు. సెకండ్, థర్డ్ క్వాలిటీ కూడా హోల్‌సేల్‌లో తక్కువ ధరకే దొరుకుతున్నాయి. కిలో రూ.12-రూ.13కే దొరుకుతున్నాయి. ఇవి పాత ఉల్లిపాయలు, ఆరుదల పాయలు కావడంతో వినియోగదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో మహారాష్ట్ర రకం ఉల్లిపాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మహారాష్ట్రలోని షోలాపూర్, నగర్ తదితర ఐదు జిల్లాల నుంచి ఇక్కడి మార్కెట్లకు ఉల్లి వస్తుంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజూ 500 టన్నుల డిమాండ్ ఉంటుందంటే మహారాష్ట్ర ఉల్లి డామినేషన్ అర్థమవుతుంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనే దాదాపు 300 టన్నుల డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెప్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు లేవు. దీంతో మహారాష్ట్ర నుంచి నేరుగా రాజమహేంద్రవరం, జిల్లాలోని ఇతర మార్కెట్లకు వచ్చే ఉల్లిపాయలను లోకల్‌గానే వినియోగిస్తున్నారు. ఒకప్పుడు రాజమహేంద్రవరం ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్‌కు కేరాఫ్‌గా ఉండేది. కాలక్రమేణా ఉమ్మడి తూర్పులో ఎక్కడికక్కడ మార్కెట్లు పెరిగాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సామర్లకోట, ప్రత్తిపాడు, బూరుగుపూడి, రావులపాలెం, కొత్తపేట, అమలాపురం ప్రాంతాల్లో ఉల్లి హోల్‌సేల్ మార్కెట్ పుంజుకుంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో కర్నూలు ఉల్లిపాయలు దాదాపుగా నిలిచిపోతాయని... పులివెందుల, మైదుకూరు రకాలు ప్రారంభమవుతాయని చెప్తున్నారు. ఈ రకాలు ఎన్ని వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గే అవకాశం లేదనే చెప్పాలి. దీంతో ధరలు కూడా దిగివచ్చే అవకాశం లేదు. అయితే ఉల్లిపాయలను 4 శాతం విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి మహారాష్ట్ర వ్యాపారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని, దీనివల్ల ధర కొంచెం పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు చెప్పారు. ఎగుమతులు 15 శాతం అయితే ధరలు కాస్త పెరిగే అవకాశం ఉందన్నారు.

ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరగాల్సిన మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశారని, నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తారని కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ తెలిపారు.



స్వామి, అమ్మవార్లు, ఇతర ఉపాలయాల్లో దేవతలకు అలంకరించే పట్టు వస్త్రాలు

సత్యదేవుని సన్నిధిలో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 11 రోజులు వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణ
- రూ 2.75 లక్షలు విలువైన పట్టు వస్త్రాలు అందజేసిన దాత

అన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో విశ్వావసు నామ సంవత్సర దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఆలయ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కనకదుర్గ, వనదుర్గ ఆలయాల్లో ప్రతి నిత్యం కుంకుమార్చనలు, సూర్యనమస్కారాలు, జపాలు, పారాయణలు, సహస్రలింగార్చన జరుగుతాయి. విజయదశమి రోజున హోమ పూర్ణాహుతితో వైదిక కార్యక్రమాలు పూర్తవనుండగా రాత్రి దేవస్థానం హైస్కూలు మైదానంలో శమీ పూజ నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. శరన్నవరాత్రుల్లో స్వామి, అమ్మవార్ల మూల వరులకు, ఉపాలయాలైన యంత్రాలయం, రామాలయం, వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో కొలువైన దేవతామూర్తుల అలంకరణకు ఒక దాత రూ.2.75 లక్షలు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు దంపతులు వీటిని దేవస్థానం అధికారులకు గురువారం అందజేశారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు గోపాలకృష్ణ, బీటీ కృష్ణ

యూఏవీల డిజైన్‌పై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని ఐఎస్టీలో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యూఏవీ) డిజైన్, అసంబుల్ ఫ్లైట్ ఆపరేషన్స్‌పై రెండు రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ ఏవియానిక్స్, ఐఎస్టీ, జేఎన్టీయూకే ఆధ్వర్యంలో విభాగాధిపతి ప్రొఫెసర్ కె.పద్మప్రియ అధ్యక్షతన నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డీఐఎస్టీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. యూఏవీల సాంకేతికత ప్రాధాన్యతను డాక్టర్ డోలా సం దీప్ వివరించారు. పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు దినేష్‌ప్రసాద్ ఎంపిక

అంబాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



అంబాజీపేట మండలం ముక్కామల జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి జి. దినేష్‌ప్రసాద్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం ఎస్ఆర్ మూర్తి తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 79 కేజీల విభాగంలో ప్రసాద్ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ ముత్యాల పవన్‌కిషోర్ తెలిపారు. ప్రసాద్‌కు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ బండారు వరలక్ష్మి, ఎంపీటీసీ వనచర్ల దుర్గాభవాని, ఎస్ఎంసీ చైర్మన్ బి.శామ్యూల్‌రాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



79 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దినేష్‌ప్రసాద్

22న పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపు

● పుష్కరిణి వద్ద జల్లుస్నానానికి ఏర్పాట్లు

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీటిని ఈ నెల 22న తొలగించనున్నారు. మహాలయ పక్షాలు కావడంతో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాదగయలో పిండప్రదానాలు చేసి వాటిని పుష్కరిణిలో కలుపుతున్నారు. దీంతో పుష్కరిణిలో నీరు కలుషితమైందని చెప్తున్నారు. ఈనెల 21వ తేదీ మహాలయ అమావాస్య వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. మహాలయ పక్షాలు ముగిసిన వెంటనే 22న పుష్కరిణిలో నీరు తొలగిస్తామని చెప్పారు. అక్టోబరు 2న విజయదశమి పర్వదినం సందర్భంగా పుష్కరిణిలో తెప్పోత్సవం సమయానికి మరలా కొత్త నీరు పెడతామని తెలిపారు. ఈలోగా ఆలయానికి వచ్చే భక్తులు, భవానీ మాలధారులు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందిపడకుండా ఉండేందుకు పాదగయ పుష్కరిణి తూర్పు వైపున జల్లుస్నానాలకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో చెప్పారు.

శ్రీలంకలో చిక్కుకున్న మత్స్యకారులు..
వారి కుటుంబాలకు సరుకులు


సాయం చేస్తున్న ఎంపీ కార్యాలయ సిబ్బంది

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులలో రెండు కుటుంబాలకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కార్యాలయం నుంచి నిత్యవసర సరుకులను గురువారం అందజేశారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు ఢిల్లీలో ఉన్న అధికారులతో మాట్లాడి వారి తాజా క్షేమ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈనెల 12న జాఫ్నా కాఫ్స్‌కోర్టు ఈ నలుగురు మత్స్యకారులను వారి పడవతో సహా విడుదల చేయాలని, భారతదేశ సముద్రజలాల సరిహద్దు వరకు విడిచి పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు శ్రీలంక నౌకాదళాలకు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు ఈనెల 26వ తేదీలోపు అమలు చేయాలని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియను శ్రీలంక రక్షణ మంత్రిత్వశాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తూ మత్స్యకారులను వీలైనంత త్వరగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నారు.

సమిశ్రగూడెంలో వరుస దొంగతనాలు

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో బుధవారం రాత్రి రెండు చోట్ల దొంగలు పడి నగదు, బంగారం దోచుకుపోయారు. డీ.కొండమ్మకు చెందిన ఇంట్లో సుమారు రూ. 80 వేల నగదు, రెండు కాసుల బంగారు వస్తువులు, రెండు జతల వెండి పట్టీలు, అలాగే కాలువగట్టుపై ఉన్న టీ షాపులో 20 వేల నగదు దోచుకు పోయారని బాధితులు సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బైక్ దొంగల అరెస్టు ... ఆరు వాహనాలు స్వాధీనం

కె.గంగవరం, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): కే.గంగవరం మండలంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తితో పాటు వాటిని కొనుగోలు చేసిన వారిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా తెలిపారు. వివరాలివి. రామచంద్రపురానికి చెందిన పెమ్మిరెడ్డి బాల వెంకట్(బాల) బైక్‌లు దొంగలించి కోటిపల్లికి చెందిన కర్రి సత్యనారాయణ (నాని), గంగవరం గ్రామానికి చెందిన పెంటపాటి వీరబాబుకు విక్రయించాడు. ఈ ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రామచంద్రపురం కోర్టులో హాజరుపరిచగా 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను వారి యజమానులకు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో ముద్దాయిలను పట్టుకున్న బృందాన్ని ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ రఘువీర్ అభినందించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో
వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలి



కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రమిస్తున్న వీఆర్వోల సంఘం ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్వోల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కాకినాడ కలెక్టరేట్లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రేడ్-1 వీఆర్వోలతో భర్తీ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. అనంతరం డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడ్రేవు పద్మ, కాకినాడ డివిజన్ అధ్యక్షుడు మేడిశెట్టి కిషోర్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు యల్లేశ్వరరావు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసు, ఇతర ప్రతినిధులు అప్పల నాయుడు, ఎండీ రాజా, శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కోసం
నిషిద్ధ ప్రాంతం గుర్తింపు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పారాదీప్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించిన ఆయిల్ పైప్ లైన్‌కు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరంలో సర్వే నెం.723/3ఎలో 65 సెంట్ల భూమిని నిషిద్ధ ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు గురువారం జీవో నెం.105 జారీ చేసింది.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన గట్టున సత్యవతి (55) అనుమానాస్పదస్థితిలో గురువారం మృతి చెందింది. మధ్యాహ్నం సత్యవతి సోదరి దేవి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో సమీప బంధువైన కూనపురెడ్డి గంగారత్నంకు ఈ విషయం చెప్పగా... ఆమె వెళ్లి చూసేసరికి బాత్‌రూమ్ సమీపంలో రక్తపు మడుగుతో సత్యవతి పడి ఉందని దేవికి సమాచార మిచ్చింది. ఆమె వచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు. ఈమె భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. ఒక్కరే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో చుట్టుపక్కల వారు భయాందోళన చెందారు.

జంట హత్యలో కొనసాగుతున్న విచారణ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అప్పు తీరుస్తానని రమ్మని చెప్పి ఇద్దరిని హత్య చేసి బావిలో పడవేయడమే గాక, మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై గొల్లప్రోలు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అనుమానితుడిగా ఉన్న రంపం గంగాధర్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గురువారం మరికొందరిని ప్రశ్నిస్తున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన రంపం గంగాధర్ అదే గ్రామానికి చెందిన రంపం శ్రీను, తోరాటి సూరిబాబును వారి వద్ద తీసుకున్న బాకీని తీరుస్తానని చెప్పి గ్రామశివారులోని పొలాల్లో ఉన్న బావి వద్దకు తీసుకువెళ్లి అందులో తోసివేసి హత్య చేశాడు. అలాగే కుంపట్ల సూరిబాబు (బాబ్జీ)పై హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. హతులు దగ్గర నుంచి ఎంత అప్పు తీసుకున్నారు, అప్పు తీర్చమని ఒత్తిడి చేయడమే హత్యకు కారణమా, ఇంకా ఏమైనా ఉన్నాయా, వారి మధ్య ఉన్న వ్యవహారాలు, ఇతర అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు గంగాధర్ మాత్రమే ఈ సంఘటనకు పాల్పడ్డాడని భావిస్తుండగా, ఇందులో మరికొందరి పాత్ర ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి అనుగుణంగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

యానాం సబ్ జైలులో ఎన్‌ఐఏ తనిఖీలు

● హత్య కేసులో ప్రధాన నిందితుడిపై ఆరా

యానాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని ప్రత్యేక సబ్‌జైల్‌లో చెన్నైకు చెందిన ఎన్‌ఐఏ అధికారుల బృందం గురువారం తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలు యానాం, పుదుచ్చేరి జైలులో ఏకకాలంలో జరిగాయి. పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయః బంధువు విలియనూర్ భాజపా ఇన్‌చార్జి సెందిల్‌కుమార్ గత 2023వ సంవత్సరం మార్చి 26న రాత్రి పూట ఇంటికి వెళుతున్న సమయంలో బైక్‌లపై వచ్చి కత్తులతో నరికి, నాటుబాంబు వేసి హత్య చేశారు. ఈ సంఘటన అప్పట్లో పుదుచ్చేరి వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా, హత్యలో ప్రధాన నిందితుడు నిత్యానందన్‌తో పాటు మరో 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో నాటుబాంబులు ఉపయోగించడం, తదితర కారణల వల్ల కేసును ఎన్‌ఐఏకు అప్పగించడంతో విచారణ కొనసాగుతోంది. ప్రధాన నిందితుడు నిత్యానందన్‌తో పాటు మిగిలిన వారందరినీ పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలుకు తరలించారు. అక్కడ జైలులో నుంచే నేర కార్యక్రమాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రధాన నిందితుడిని ఏప్రిల్ నెలలో యానాంకు తరలించారు. మళ్లీ ఇక్కడ కూడా నేర కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు ఎన్‌ఐకే సమాచారం రావడంతో చెన్నైకు చెందిన ఇద్దరు ఎన్‌ఐఏ అధికారుల బృందం గురువారం యానాం సబ్‌జైల్‌లో తనిఖీలు నిర్వహించారు. విషయాన్ని యానాం జైలు సూపరింటెండెంట్ డాక్టర్ టీ.రవిశంకర్ తెలిపారు.

అన్నవరంలో ..
హిజ్రాలకు కౌన్సెలింగ్

● శుభకార్యాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు


హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అన్నవరం ఎస్‌ఐ హరిబాబు

అన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అన్నవరం పరిసరప్రాంతాలు, రత్నగిరి కొండపై జరిగే వివాహాది శుభకార్యక్రమాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్‌ఐ హరిబాబు హెచ్చరించారు. గురువారం గ్రామంలో ఉన్న హిజ్రాలతో సమావేశమై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దారి దోపిడీలు, దొంగతనాలలో హిజ్రాలు పాల్గొన్న సంఘటనలు ఉన్నాయని, పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు. హిజ్రాలు సమాజంలో గౌరవంగా జీవించాలని అందుకు ప్రభుత్వ పరంగా సహాయసహకారాలు అందిస్తామని, అలాగే ప్రత్యామ్నాయ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన పాల వ్యాన్


యండగండి - పామర్రు రోడ్డులో దూసుకెళ్లిన వ్యాన్

కే.గంగవరం, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): కే.గంగవరం మండలంలోని పామర్రు యండగండి రహదారిలో గురువారం పంట కాలువలోకి పాలఉత్పత్తులు రవాణా చేసే వ్యాన్ దూసుకుపోయింది. తెల్లవారు జామున అంగర వైపు నుంచి పామర్రు వైపునకు వస్తున్న లారీ కుడి వైపున ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. అక్కడ పొలంలో తాటిచెట్టు ఉండటంతో దానికి ఆనుకుని నిలిచిపోయింది. లేకపోతే బోల్తా పడేది. కాగా, ప్రమాదంలో ఎవరికీ దెబ్బలు తగల్లేదు. డ్రైవర్, క్లీనర్, తదితరులు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం రెండు జేసీబీల సహాయంతో లారీని పైకి తీశారు.

డీజిల్ అక్రమ వ్యాపారం గుట్టురట్టు

» యజమాని సహా డ్రైవర్‌పై కేసు
» ట్యాంకర్ సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు


డీజిల్ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రాజానగరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏవిధమైన అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా డీజిల్ వ్యాపారం సాగిస్తున్న ట్యాంకర్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం దాడిచేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్.తాతారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్, లీగల్ మెట్రాలజీ, రవాణా శాఖాధికారులు రాజానగరం మండలం తూర్పుగోనగూడెం సమీపంలోని ఐఎస్‌టీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏపీ 39 డబ్ల్యూహెచ్ 3177 మహేంద్ర బొలేరో మినీ ట్యాంకర్ డ్రైవర్ వాహనానికి డీజిల్ కొడుతుండగా ఈ దాడి చేశామన్నారు. ట్యాంకర్ డ్రైవర్ పల్లికొండ రాజేష్ (అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం)ను పట్టుకుని బిల్లులు అడిగితే లేవని బదులిచ్చాడన్నారు. ట్యాంకర్ యజమాని రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి గంగరాజు అలియాస్ రాజేష్ ఆదేశాలతో ఇక్కడ బస్సులకు డీజిల్ కొడుతున్నానని చెప్పాడన్నారు. మొత్తం 983 లీటర్ల డీజిల్ ఇక్కడ కొట్టినట్టుగా తెలుస్తోందన్నారు. ట్యాంకర్‌కు ఏవిధమైన అనుమతులు లేవని, ట్యాంకర్ పంప్‌కు కనీసం సీలు కూడా లేదన్నారు. డీజిల్ విలువ రూ.97,310లుగా అంచనా వేశామన్నారు. ఈ మేరకు ట్యాంకర్ యజమాని, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు చేయడంతో పాటు ట్యాంకర్‌ను సీజ్ చేశామన్నారు. ఈ దాడిలో సివిల్ సప్లయిస్ అధికారి గొలుగూరి బాపిరాజు, కానిస్టేబుల్ లోవరాజు, శివ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు


గోకవరంలో విద్యుత్ పనులు చేస్తున్న దృశ్యం

గోకవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాలకు విద్యుత్ అలంకరణ చేస్తున్న ఇద్దరు యువకులు గురువారం విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గోకవరంలోని ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో వీరభద్రుడి గద్దెలో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు లైటింగ్ పనులు చేపట్టారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన పిల్లల విజయ్‌కుమార్, కోరుకొండకు చెందిన సూరాడి వీరబాబు మరి కొంతమందితో కలిసి ఈ పనులు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారిపై తొట్టె ఆటోపై ఇనుప స్టాండ్ వేసుకొని విజయ్‌కుమార్, వీరబాబు సీరియల్ సెట్ వైర్లు బిగిస్తుండగా 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదానికి గురయ్యారు. దీంతో వారిద్దరినీ స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు సమాచారం.

16 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్‌కే షరీన్ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 16 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 12 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఆరుగురి అరెస్టు.. రూ.82,260 స్వాధీనం

కొత్తపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పాతారామాలయం ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఎస్‌ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి సిబ్బంది దాడి చేశారు. ఈదాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.82,260 నగదును స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి


పవన్‌కుమార్(ఫైల్)

ముమ్మిడివరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సెంటర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. రాజుపాలేనికి చెందిన మోటారుసైకిల్ మెకానిక్ గుబ్బల పవన్‌కుమార్(25) గురువారం పల్లిపాలెం సెంటర్‌లోని మెకానిక్ షాపు నుంచి ఇంటికి వెళుతుండగా కాకినాడ నుంచి అమలాపురం పెళ్లి బృందంతో వెళుతున్న టాటాఎస్ వ్యాన్ అతివేగంగా ఢీకొని కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఐ.పోలవరం మండలం ఐ.పోలవరానికి చెందిన గుబ్బల శ్రీనివాసరావు-సత్యవతి దంపతులు రాజుపాలెంలో స్థిరపడ్డారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ మోటారుసైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పవన్ మృతితో గ్రామంలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తాం

» కమలంపాలెం పర్యటనలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు
» పునరావాస కాలనీ ప్యాకేజీ, గృహ నిర్మాణాలపై ఆరా


సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘం సభ్యులు

దేవీపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు ఇంద్రజిత్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి రంపచోడవరం పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని కమలంపాలెం పునరావాస కాలనీలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి శయని మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అందిందా? లేదా? గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయా? భూమికి భూమి కేటాయించారా ? లేదా అనే విషయాలు తెలుసుకుని వాటికి సంబంధించి అధికారులు పూర్తిగా సహకరించాలని తెలిపారు. త్వరలోనే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో కె.స్మాలన్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్‌ఐ కె.షరీఫ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఫిర్యాదు

పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యత లోపించిందని తాళ్లూరు గ్రామ నిర్వాసితులు మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కోరుకున్న చోటే పునరావాసం కల్పించడకుండా అధికారులకు నచ్చిన చోట నిర్మించారని కాలనీల నిర్మాణాలు లోతట్టు ప్రాంతంలో నిర్మించడం వల్ల ఇళ్లు ఊట తేలిపోతున్నాయన్నారు. మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదని వాపోయారు. జీవనోపాధి కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, కమిటీ సభ్యుడు గేదల పెద్దసుబ్బారావు.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామంలోని గంగాలమ్మ ఆలయ సమీపంలో దేవీపట్నం గ్రామానికి నిర్మించే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పూర్తికాలేదని, తొమ్మిదెకరాల విషయం కోర్టులో ఉందని తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కస్తామని అధికారులు పేర్కొన్నారు.

డ్వాక్రా రుణాల మంజూరులో వీవోఏ చేతివాటం

సామర్లకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామంలో మహిళా శక్తి సంఘాలకు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తున్న రుణ పథకాలలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ సుమారు రూ.20 లక్షల మేర రుణ మొత్తాల సొమ్ము తన స్వప్రయోజనాలకు వాడుకుని అక్రమాలకు పాల్పడడమే గాక రుణాలు పొందిన 26 సంఘాల సభ్యుల నుంచి అదనంగా మరో 24 నెలల డబ్బులు వసూలు చేసినట్టు సోమవారం కాకినాడ కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో డీఆర్‌డీఏ ఏజీఎం శివకుమార్ తోపాటు సామర్లకోట వెలుగు ఏపీఎం జగదీశ్వరి పండ్రవాడ గ్రామం చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ఒక డ్వాక్రా సంఘ సభ్యురాలు చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేస్తున్నట్టు సమాచారం. పలు మహిళా సంఘాలకు మంజూరైన రుణ మొత్తాలను సదరు వీవోఏ పక్కదారి మళ్లించినట్టు ఆరో పణలు ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్‌డీఏ ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. రెండు రోజులుగా పండ్రవాడ గ్రామానికి చెందిన దత్తత బ్యాంకులైన తిమ్మాపురం కార్పొరేషన్ బ్యాంకు, సామర్లకోటలోని మరో రెండు బ్యాంకులలోనూ, అచ్చంపేటకు చెందిన గోదావరి గ్రామీణ బ్యాంకులోనూ ఆరోపణలకు గురైన వీవోఏ నిర్వహించిన బ్యాంకింగ్ కార్యకలాపాలను ఆయా బ్యాంకు మేనేజర్లతో కలిసి పరిశీలించినట్టు తెలిసింది. గురువారం గ్రామంలో పలు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను విచారణాధికారుల బృందం స్వయంగా విచారించి నివేదికలను తయారు చేశారు. విచారణ అధికారులు ప్రాథమికంగా రూపొందించిన సమాచారం ప్రకారం సుమారు రూ.20 లక్షల మేర రుణ మొత్తాలను పక్కదారి పట్టించినట్టు అంచనా వేశారు. ఈ విషయమై వెలుగు ఏపీఎంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు డీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నామని, పూర్తి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తా మని స్పష్టం చేశారు.

గోప్యంగా దర్యాప్తు

భార్యను వేధిస్తున్న భర్తకు రిమాండ్

బిక్కవోలు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిప్రసాద్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన శ్రీదేవితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. 22 ఏళ్ల శ్రీదేవి పుట్టుకతోనే మూగ, చెవిటి. అయితే సాయిప్రసాద్‌కు ఇదివరకే విజయవాడకు చెందిన మహిళతో వివాహమైంది. వారికి ఒక పాప కూడా వుందన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టి శ్రీదేవిని రెండో వివాహం చేసుకున్నాడు.ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శ్రీదేవి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి సాయిప్రసాద్‌తో పాటు అతడి తండ్రి వానబాలుడు అరెస్టు చేశారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధిచారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రుడా చైర్మన్ బీవీఆర్



కలెక్టర్ కీర్తికి మొక్కను అందజేస్తున్న బీవీఆర్, బొకేలు అందిస్తున్న ఎస్పీ, జైలు సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి చేకూరిని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమెను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. రుడా పరిధిలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలు, రానున్న గోదావరి పుష్కరాల్లో రుడా బాధ్యతలు వంటి అంశాలపై ఆమెతో చర్చించారు. అలాగే కలెక్టర్‌ను ఎస్పీ నరసింహకిషోర్, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిశారు.పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. పలు అంశాలపై చర్చించారు.

నేడు పోషకాహారంపై నన్నయలో వర్క్‌షాప్

వంటకాలపై మహిళలకు పోటీలు

ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం మహిళల కోసం పోషకాహారం(వంటగది కెమిస్ట్రీ)పై వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ స్థానిక డెక్కన్ విభాగం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి విభాగం సహకారంతో రసాయన విభాగంలో మహిళలకు ఈవర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. సహజ ఆహారం పోషక విలువలపై అవగాహన, మహిళల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచడం లక్ష్యంగా జరిగే ఈ కార్యక్రమంలో మహిళలు ఆరోగ్యకరమైన వంటకాలపై పోటీలు ఉంటాయన్నారు. మహిళలు తమ ఇంటి వద్ద ఆహార పదార్థాలు సిద్ధం చేసి తీసుకురావాలని చెప్పారు. కృత్రిమ రంగులు లేకుండా రుచిగా శుచిగా శాఖాహారం మాత్రమే తీసుకురావాలని చెప్పారు. మిల్లెట్ ఆధారిత పదార్థాలకు ప్రాధాన్యమిస్తామన్నారు.చదువుతో సంబంధం లేకుండా మహిళలు ఎవరైనా రూ.50 చెల్లించి స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు బహుమతులు ఉంటాయని అన్నారు. మరిన్ని వివరాలకు 93471 53270 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

సైనిక్ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు కె.శిరీష, సీహెచ్ వీర సూర్యదేవి ఆలిండియా సైనిక్ క్యాంపు - 2025లో పాల్గొని వివిధ ఈవెంట్లలో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సైనిక్ క్యాంపులో వివిధ కేటగిరీల్లో గర్ల్ కేడెట్లు ప్రతిభ కనబరచి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే పేర్కొన్నారు. కేడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ అధికారులు భాషా షేక్, కె.అనుష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన..

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం రంగంపేట ఎస్‌వీఎస్ఎం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పార్లమెంటరీ వ్యవహారాలపై అవగాహన కల్పించారు. ప్రశ్నోత్తరాలు ఎలా నిర్వహిస్తారు. జీరో అవర్‌లో ప్రశ్నలు ఎలా వేస్తారు, ఫైనాన్స్ బిల్లు ఎలా పెడతారు తదితర విషయాలను తెలియజేశారు. రాజనీతిశాస్త్ర అధ్యాపకులు బాబ్జీ, సయ్యద్ ఫర, రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం పార్థసారధి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగంలో మరమ్మతుల నిమిత్తం శనివారం నగరంలో పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంచినీటి విభాగంలో 600ఎంఎం పీఎస్సీ పైప్‌లైన్ పగిలిపోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు నగరంలో 1,2,3,4(9,10, 11,12)వార్డుల్లో పార్టు, 36లో పార్ట్, 37, 42 వార్డుల్లో పార్ట్, 43,44,48, 50 వార్డుల్లో శనివారం ఉదయం, సాయంత్రం నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం నుంచి యథావిధిగా సరఫరా చేస్తామన్నారు. నీటి సరఫరా లేని రోజున కార్పొరేషన్ ట్యాంకర్లతో సరఫరా చేస్తామన్నారు. ట్యాంకర్ కోసం వాటర్ సప్లయి ఏఈ 98499 08350 నెంబరును సంప్రదించాలని కోరారు.

నవంబరులో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నవంబరు నెలలో జరిగే ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర 24వ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తూ, సమాజంలో వివక్షలకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడితప్పిందని, ప్రభుత్వ విద్యారంగంపై పాలకులు శ్రద్ధ చూపడంలేదని విమర్శించారు. భవిష్యత్ కార్యాచరణకు దిశా నిర్దేశం చేసుకునేందుకు మహాసభలు వేదికగా నిలుస్తాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు భానుప్రసాద్, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థల వేధింపులతోనే ఆటో డ్రైవర్ మృతి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో మల్లికార్జున్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మావూరి సుబ్రహ్మణ్యం(49) ఫైనాన్స్ సంస్థల వేధింపుల వల్లే మృతిచెందాడని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధరరావు ఆరోపించారు. గురువారం ఆటోడ్రైవర్ హైబీపీతో కుప్పకూలాడని తెలుసుకున్న తాను వెంటనే సుబ్రహ్మణ్యంను హస్పిటల్‌కు తరలించి వైద్యం చేయించినా పరిస్థితి విషమించి మరణించాడన్నారు. ఇప్పటికే ఉచిత బస్సుల వల్ల సర్వీస్ లేక ఇబ్బందుల్లో ఉన్న సుబ్రహ్మణ్యంపై ఫైనాన్స్ సంస్థ వేధింపులు ఎక్కువ కావడం వల్ల మృతిచెందడం బాధాకరమన్నారు.సుబ్రహ్మణ్యంకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. ఉచిత బస్సు పథకం విషయంలో ప్రభుత్వ పునరాలోచన చేయాలని కోరారు.

స్వర్ణాంధ్ర 1800వ అన్నసమారాధన



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లాలాచెరువు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమం గురువారం 1800వ రోజు చేరుకుంది. నిర్వాహకుడు గుబ్బల రాంబాబు నేతృత్వంలో స్థానిక పుష్కరాల రేవు వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ ఎం.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలోని అవసరార్థులు, నిరాశ్రయులకు ఈ అన్నదానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాంబాబును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మలపూడి గోవింద్, జమాలజిస్ట్ నాగభూషణం, అనూప్ జైన్, యూసఫ్, అమీర్, దువ్వాడ రాజా, అన్సర్ అహ్మద్, మీరా కుమారి, జహంగీర్, బెన్నీ, కలీం హరికృష్ణ జాయేద్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

గోకవరం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా వ్యక్తులు అందించిన సేవలతోనే గుర్తింపు దక్కుతుందని పలువురు వక్తలు అన్నారు. జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డు అందుకున్న యాళ్ల అబ్రహం పాల్,ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎంఎస్.రత్నరాజు, జి.రాంబాబు, డి.సుబ్రహ్మణ్యం, జెస్సీ జానీలతో పాటు, మరికొంతమంది ఉపాధ్యాయులను యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. గురువారం స్థానిక సూర్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.నాగభూషణం, ఆర్.హరనాథ్, పంతం త్రిమూర్తులు, ప్రేమకుమార్, ఎస్.కుమార్, కె.శ్రీనివాస్, బి.అప్పారావు, రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

చెరువు కాదు..రోడ్డే!



వర్షం నీటితో దర్శనమిస్తున్న రాజానగరం-కలవచర్ల ప్రధాన రహదారి

- అస్తవ్యస్తంగా కలవచర్ల-సీతారాంపురం రహదారి
- ఆరేళ్లుగా నరకం చూస్తున్న మూడు గ్రామాల ప్రజలు
- జలాశయాన్ని తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు



రాజానగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కలవచర్ల-సీతారాంపురం ఆర్‌అండ్‌బీ రహదారి ప్రయాణికుల పాలిట శాపంగా పరిణమించింది. ఆరేళ్లుగా ఈ రహదారిపై ప్రయాణికులు నరకాన్ని చూస్తున్నారు. గత ప్రభుత్వంలో విస్తరణ పేరుతో ఈ రహదారిలో గోతులను మట్టితో పూడ్చిపెట్టి లోపభూయిష్టంగా అసంపూర్తి పనులు చేసి చేతులు దులుపేసుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారిపై పాత కల్వర్టలను పరిగణలోకి తీసుకోకుండా, నాయకులకు అనుకూలమైన చోట మొక్కుబడిగా కల్వర్టులు ఏర్పాటు చేశారన్నారు. రాజానగరం నుంచి గాదరాడ వరకు సుమారు పది కిలోమీటర్లు మేర రహదారి ఛిద్రంగా మారింది. ఈ రహదారిపై ఆరేళ్లుగా కలవచర్ల, సీతారాంపురం, గాదరాడ ప్రజలు నరకం చూస్తున్నారు.దీనికి తోడు కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రహదారి జలాశయాలను తలపిస్తూ వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. కలవచర్ల, సీతారాంపురం గ్రామస్థులు ఆరేళ్లుగా మురారి మీదుగా రాజానగరానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణం భారం వాహనదారులపై పడుతుందన్నారు. మోటార్‌సైకిళ్లు రహదారిపై నిండిన నీటి మధ్యలో మునిగి మొరాయిస్తున్నాయి. దీనితోడు రాత్రింబవళ్లు మట్టి మాఫియా లారీల దాటికి రహదారి మరీ అధ్వానంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన రహదారి అభివృద్ధిని పునరుద్ధరించాలని, వీలుకాని పక్షంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టే దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

పలుచోట్ల స్వస్థ నారీ సశక్త్ పరివార్



పాలచర్ల ఆరోగ్య శిబిరంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. రాజానగరం మండలం పాలచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం బలంగా ఉంటుందని అన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరు వరకూ జిల్లాలో వైద్యశిబిరాలు జరుగుతాయన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 213 మందికి వైద్య పరీక్షలు జరిపామని చెప్పారు. టీబీ స్క్రీనింగ్, సెర్వికల్, కంటి వ్యాధి, తదితర పరీక్షలతో బాటు ఎనిమిది మందికి ఇమ్యునైజేషన్ చేశామని చెప్పారు. వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వాడపల్లి సతీష్, గైనకాలజిస్ట్ అలేఖ్య, నియోనటాలజిస్ట్ డాక్టర్ శిరీష సేవలందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, నాయకులు గంగిశెట్టి చంటిబాబు, వసంతరాయుడు, రాజేంద్రప్రసాద్, బిందుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా వుంటే ఆ కుటుంబాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.దుర్గాదేవి ఆధ్వర్యంలో 212 మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అలాగే కొంకుదురు పీహెచ్‌సీలో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో 109 మంది మహిళలకు వివిధ పరీక్షలు జరిపి మందులు అందజేశారు. మహిళల ఆరోగ్యం కాపాడుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో బిక్కవోలు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రెడ్డి నాగవేణికుమారి, సర్పంచ్‌లు సరెళ్ల సుమలత, సత్తి వీరమణి, సొసైటి చైర్మన్ చింతా శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీలు పీవీ, అమ్మిరెడ్డి, జంపా వెంకటలక్ష్మి, ఎంపీడీవో వి.శ్రీనివాస్, తహశీల్దార్ సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, దుళ్ల గ్రామంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు పర్యవేక్షణలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు డా. ఎస్.జెస్సీ సుప్రియ, డా. ఎం.మణిజ్యోత్స్న అన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు బొర్సు సుబ్రహ్మణ్యం, చిక్కాల ఈశ్వరరావు, కట్టుంగ నాగరాజు, గుర్రపు సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బిక్కవోలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వైద్యసిబ్బంది



కడియంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం

కనీస వేతనం అమలు చేయాలి

అనపర్తి, గోకవరం, రంగంపేటలో వీఆర్‌ఏల నిరసన

తహశీల్దార్లకు వినతులు



అనపర్తిలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

అనపర్తి/గోకవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏలు) డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ అనపర్తి, గోకవరం మండలాల్లో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, పేస్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ ఏలను పర్మినెంట్ చేయాలని డిమాం డు చేశారు. రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు అనపర్తి యూనియన్ గౌరవాధ్యక్షుడు దండకడియాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెల 20న రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని అన్నారు. అలాగే రంగంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి యూనియన్ అధ్యక్షుడు ఎల్.రామారావు, కార్యదర్శి ఎల్.రాజు, ఉపాధ్యక్షుడు ఎస్కే షాబాషా, ట్రెజరర్ బాలబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కోరుకొండ ఫొటోగ్రాఫర్స్



కోరుకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ది గోదావరి ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ కోరుకొండ ఫొటోగ్రాఫర్ యూనియన్ విజయం సాధించింది. జట్టు సభ్యులను జనసేన సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ సత్కరించారు.

క్లాత్‌బ్యాగ్‌లనే వినియోగించండి

కార్పొరేషన్ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి వ్యాపారులందరూ గుడ్డ సంచులను వినియోగించేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం మెప్మా సీవోలు, క్లాత్ బ్యాగ్‌లు తయారీదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నారు. వ్యాపారులకు క్లాత్‌బ్యాగ్‌లను అలవాటు చేయాలన్నారు. నగరంలో కొన్ని మహిళా సంఘాలు జనుముతో సంచులను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. అన్ని సమాఖ్యల ద్వారా నగరంలో క్లాత్‌బ్యాగ్‌ల వాడకం పెరిగితే మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తతో ఎరువు తయారు చేసుకుని(హోం కంపోస్టింగ్) మొక్కలకు వినియోగించుకునే విధానంపై ప్రజల్లో అవగాహన పెంచాలని సీవోలకు సూచించారు. టెర్రస్ గార్డెనింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే ఇంటి వద్ద మొక్కలు, కూరగాయలు, పండ్లు పెంచుతున్న వారి వివరాలు సేకరించాలని కమిషనర్ పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

అనపర్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యాలయంలో సహాయకురాలిగా చేస్తూ అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న లక్ష్మీభవానిని బీజేపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, కార్యదర్శి గొల్లు హేమతులసి, గిరి డా గంగాభవానీ గురువారం రాజమహేంద్రవ రం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు వారి ద్వారా ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో ఫోన్‌లో సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కాపునాడు యువజన అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ కాపునాడు యువజన విభాగం అధ్యక్షుడిగా సింహాద్రి వెంకట దుర్గాప్రసాద్‌ని నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కాపు నాయకులు ముమ్మిడ వీరబాబు, చిత్రకళ బాబ్జీల చేతుల మీదుగా దుర్గాప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో డి.చక్రపాణి, దేశినీడి రాంబాబు, కాళ్ల చక్రరావు, వుర్రింకల సతీష్, కె.నాయుడు, సుంకర మల్లికార్జునరావు, దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళపై అవగాహన సదస్సు



చిత్రకళపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చిత్రకారుడు పరస రవి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారుడు పరస రవి విద్యార్థులకు చిత్రకళపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారత ప్రభుత్వ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్న చిత్రకళా సమ్మేళనంలో గురువారం విద్యార్థులకు చిత్రకళపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు



కాపవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోరుకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శివారు కాపవరం శ్రీ రాజరాజేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను గురువారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 22న ఆలయ అనువంశక ధర్మకర్త, ఆలయ వ్యవస్థాపకుడు నీరుకొండ వర్ధన విజయభాస్కరరావు(బాబ్జి) దంపతులతో రాజరాజేశ్వరి దేవి కలశ స్థాపన, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. ఉదయం, సాయంత్రం అమ్మవారి ప్రత్యేక కుంకుమార్చనలు, 29న ఉదయం 108 దంపతులతో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం చిన్న పిల్లలకు సరస్వతి పూజ నిర్వహించనున్నారు. అక్టోబరు 5న అమ్మవారి ఊరేగింపు, 8న అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నీరుకొండ విజయభాస్కరరావు, శ్రీదేవి వెంకట మణిసాయి మోటార్ వర్కర్స్ యూనియన్ కట్టా సత్తిబాబు, జుత్తుక భీమన్నారాయణ, పంచాది వెంకటరమణ,ఆలయ కమిటీ సభ్యులు పెనంగి నాగేశ్వరరావు, కొప్పాల మణి శేషకుమార్, కొచ్చెర్ల సాయిబాబు, పోకర కొండ పాపారావు,నీరుకొండ కోటిరామకృష్ణ, బండారు మల్లేశ్వరరావు,ఇమ్మంది సుబ్రహ్మణ్యం, ఆదిమూలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైట్ కళాశాలలో అధ్యాపకులిద్దరికి పీహెచ్‌డీలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): భూపాలపట్నంలోని రాజమహేంద్రి (రైట్) ఇంజనీరింగ్ కళాశాలలో కోశాధికారి పి.రవికిరణ్, ఫ్యాకల్టీసభ్యులు కె.హరితారాణి మలేషియాలోని లింకన్ యూనివర్సిటీ కళాశాల నుంచి డాక్టరేట్ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరినీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి శుక్రవారం కళాశాలలో పీహెచ్‌డీ అవార్డు పత్రాలను అందజేసి అభినందించారు. రవికిరణ్ వ్యర్థాల నిర్వహణ పట్టణ వాతావరణం వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజ్ సెగ్మెంటేషన్ టెక్నాలజీ వినియోగంపై పత్ర సమర్పణ చేశారు. హరితారాణి సీఎస్ఎన్, ట్రాన్స్‌ఫార్మర్ మోడళ్ల సమ్మిళిత పద్ధతిని ఉపయోగించి హైదృచిత్ర విశ్లేషణ, ఉపగ్రహ చిత్రాల అధ్యయనంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు వారిని అభినందించారు.

ఎలుకల నిర్మూలనకు చర్యలు

దేవరపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటను కాపాడుకోవడానికి సామూహిక ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖాధికారి కమలరాజు సూచించారు. దుద్దుకూరులో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ఎలుకల జీవనశైలి రైతులకు వివరించారు. ఒక జత ఎలుకలు ఒక సంవత్సరంలో 2067 ఎలుకలను పుట్టిస్తాయని కాబట్టి నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు.



ఉల్లి..లొల్లి!



రైతు బజార్లలో మోళీ సాగుతూనే ఉంది.. అయినా అధికారులకు పట్టడంలేదు.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో కర్నూలు ఉల్లిపాయలనే విక్రయిస్తున్నారు. కేవలం రూ.11లే ఉన్నా ఈ ఉల్లిపై ఆసక్తి ఉండదు. మహారాష్ట్ర ఉల్లిపాయల వినియోగంపైనే ఆసక్తి చూపుతారు. ఆ ఉల్లిపాయల నుంచి లాభం తక్కువగా ఉండడంతో కేవలం కర్నూలు ఉల్లినే రైతు బజార్లలో ప్రజలకు అంటగట్టేస్తున్నారు.

8

రెండో సారి..11 బార్లు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బార్లకు మళ్లీ లాటరీ నిర్వహించారు. జిల్లాలో గురువారం 11 బార్‌లను కేటాయించారు. వీటిలో రాజమహేంద్రవరం సిటీలో 9, కడియపులంక, నిడదవోలులో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. జిల్లాలో మొత్తం 25 బార్‌లకు మొదటి నోటిఫికేషన్ ఇచ్చాయి. అయితే దరఖాస్తులు అంతంతమాత్రంగానే వచ్చాయి.తొలి దశ నిర్వహించిన లాటరీలో కేవలం 9 బార్‌లకు అనుమతినిచ్చారు.మిగతా వాటికి రెండో నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో 11 బార్‌లకు 44 దరఖాస్తులు అందాయి.ఈ మేరకు గురువారం సబ్-కలెక్టర్ కృష్ణ నాయక్ లాటరీ తీశారు. బార్‌లకు దరఖాస్తులు రావడంలో ఇబ్బందులను పరిష్కరించే నివేదికను సమర్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.అనుకూలమైన నిర్ణయం తీసుకుంటారనే ఉద్దేశంతో బార్ వ్యాపారులు ముందుకు వచ్చారు. మిగతా 5 బార్‌లకు మళ్లీ నోటిఫికేషన్ పిలిచే అవకాశం ఉంది.

అదిరిన.. పోలీస్ భోజనం!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు మారుతున్నారు.. జనాలకు చేరువ అవుతున్నారు.. ఫ్రెండ్లీ పోలీస్‌కి బాటలు వేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ కార్యాలయం, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం భారీ అన్న సంతర్పణ చేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ విచ్చేసి పలువురికి స్వయంగా వడ్డించారు. అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనదని చెప్పారు. మన సంస్కృతి గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేస్తుందన్నారు. బిరియానీ, పెరుగుచట్నీ, పులిహోర, స్వీటు, బూరె, రెండు కూరలు, సాంబారు, అన్నం తదితర రకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానం కార్యక్రమం మొత్తం పోలీసులే వడ్డన చేయడం గమనార్హం. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీ కృష్ణ, త్రీటౌన్ సీఐ అప్పారావు, వన్‌టౌన్ సీఐ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై విజిలెన్స్!



రోడ్డుపక్కనే లారీ ఆపి ఆటోలో ఎక్కించి రైతులకు అందజేస్తున్న యూరియా బస్తాలు

యూరియా అక్రమ దందాకు అడ్డుకట్ట

- మూడు జిల్లాలకు 3 టీమ్‌లు ఏర్పాటు
- 99 చోట్ల తనిఖీలు.. 16 కేసులు నమోదు
- రూ.99.59 లక్షల విలువైన ఎరువులు సీజ్
- గొల్లప్రోలు మండలం 548 బస్తాలు పట్టివేత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

యూరియాపై భిన్నవాదనలు.. అధికారులు కొరత లేదంటున్నారు.. రైతులు కొరత అంటూ ఆందోళన చెందుతున్నారు. అవసరానికి సరిపడా పంపిస్తున్నామని ప్రభుత్వం గణాంకాలతో సహా చెబుతోంది. అయితే రైతులు మాత్రం అడపాదడపా ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ రంగంలోకి దిగింది. యూరియా పంపిణీ చేస్తున్న ఆర్ఎస్‌కే, సొసైటీలు, ఎరువుల షాపులపై నిఘాపెట్టింది. కొరత లేనప్పటికీ సమస్య ఎక్కడ ఉత్పన్నమవుతుందనే విషయాన్ని నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమైంది. గత నెల 23న విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, రిటైల్ షాపుల్లో మూడు జిల్లాల్లో మూడు ప్రత్యేక బృందాలు నిరంతరం సంచరిస్తూ తనిఖీలు చేస్తున్నాయి. రికార్డులు సరిగా లేకపోయినా, నిల్వ, అమ్మకానికి పొంతన కుదరకపోయినా కేసులు నమోదు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ వరకూ 99 తనిఖీలు చేసి 6(ఏ) కేసులు 16 నమోదు చేశారు. మూడు జిల్లాల్లో రూ.99.59 లక్షలు విలువైన 318 టన్నుల ఎరువులు సీజ్ చేశారు. వీటిలో 130 టన్నుల యూరియా ఉంది. రికార్డులు సక్రమంగా లేని 31 కేసుల్లో రూ.2 కోట్ల విలువైన 722 టన్నుల యూరియా విక్రయాలు నిలుపుదల చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలో తాజాగా విజిలెన్స్, వ్యవసాయాధికారుల తనిఖీల్లో రెండు లారీల్లో అక్రమంగా తెచ్చిన 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

సీజ్ చేస్తున్నారు.. తరలించేస్తున్నారు!

గతంలో సీజ్ చేసిన ఎరువులను కేసు పరిష్కారం కాబడే వరకూ రిలీజ్ చేయడం జరిగేది కాదు. దీంతో నెలల తరబడి ఎరువులు గోదాముల్లో ఉండేవి. ఇప్పుడు యూరియా సీజ్ చేస్తే 24 గంటల్లో అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు.



గొల్లప్రోలు మండలంలో సీజ్ చేసిన రెండు లారీలు

సమస్య ఉంటే డయల్ 80082 03262



యూరియా సరఫరాపై అప్రమత్తంగా ఉన్నాం. విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేసి అక్రమాలపై కేసులు పెడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు విక్రయించడం తదితర అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే 80082 03262 నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

- స్నేహిత, విజిలెన్స్ అధికారి, ఉమ్మడి తూర్పుగోదావరి

అక్రమ దందా..అడ్డంగా చిక్కారు!

- అక్రమ మార్గాల్లో యూరియా
- బ్లాక్‌మార్కెట్‌లో బస్తా రూ.400
- నలుగురిపై కేసు..అరెస్టు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియాపై ప్రభుత్వం, అధికారులు ఎంత నిఘా ఉంచినా అక్రమ మార్గాల్లో తరలిపోతోంది. ఇతర ప్రాంతాల నుంచి యూరియాను లారీల్లో తెచ్చి బ్లాక్‌మార్కెట్‌కు తరలించి బస్తాపై అదనంగా రూ.400-500 వరకూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎరువుల డీలర్లు గ్రామాల్లోకి నేరుగా లారీలు తెచ్చి విక్రయాలు సాగిస్తున్నారు.గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, షాపులకు రావాల్సిన నిల్వలు పక్కదోవ పట్టిస్తున్నారని అందిన ఫిర్యాదులపై విజిలెన్స్ సీఐ ఐ.గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తనిఖీలు చేపట్టారు. తాటిపర్తి గ్రామ శివారులో వన్నెపూడి రోడ్డులో యూరియా లోడుతో రెండు లారీలను గుర్తించి విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే ర్యాక్ నుంచి 450 బస్తాల ఎస్ఎఫ్ఎల్ యూరియా తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్‌కు లారీలో తెచ్చారు. అయితే షాపు నిర్వాహకుడు సదరు లారీని షాపు వద్దకు రానివ్వకుండా వేరే ప్రాంతంలో నిలపమని చెప్పి ఆటోలు, మోటార్ సైకిళ్ల ద్వారా 127 బస్తాల యూరియా తరలించినట్టు లారీ డ్రైవర్ తెలిపారు. మరో లారీలో 450 బస్తాల యూరియాను ద్వారపూడి రైల్వే వేగన్ నుంచి తాటిపర్తిలోనే నాగదుర్గా ఏజన్సీస్‌తోపాటు దుర్గా సరస్వతి ట్రేడర్స్‌కు తీసుకువచ్చారు. ఇందులో 225 బస్తాల వంతున రెండు షాపులకు తీసుకోవాలని చెప్పారని లారీ డ్రైవర్ తెలిపారు. నాగదుర్గా ఏజన్సీస్‌కు వచ్చిన స్టాకును వన్నెపూడిలో రోడ్డుపై నిలిపి రూ.400 వంతున విక్రయించినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. తాటిపర్తి డీలర్లకు ఈ స్టాకు హోల్‌సేల్ డీలర్లుగా ఉన్న సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం లక్ష్మీ కల్యాణి ఎంటర్‌ప్రైజెస్, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఏజన్సీస్ నుంచి పంపినట్టు గుర్తించారు. యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించి రెండు లారీలతోపాటు 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకున్నారు. వీరు తనిఖీలు చేస్తున్న సమయంలోనే ఈ పోస్ మిషన్ ద్వారా నాగదుర్గా ఏజన్సీస్ ప్రతినిధి రైతుల వేలి ముద్రలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా సదరు మిషన్‌ను సైతం సీజ్ చేశారు. వీటిని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు. విజిలెన్స్ వ్యవసాయాధికారుల తనిఖీలు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ కొనసాగాయి.

నలుగురి అరెస్టు

యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయించడం, ఈపోస్ యంత్రాలను దుర్వినియోగం చేసి రైతుల వేలి ముద్రలు సేకరించి తప్పుడు రికార్డులు సృష్టించేందుకు ప్రయత్నించడం తదితర అంశాలపై ఏవో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు రెండు కేసులు రిజిస్టర్ చేశామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్ నిర్వాహకుడు దాసం శ్రీనివాస్, హెల్పర్ కర్రెడ్ల కనక వీర బాబు, మండపేట మండలం ద్వారపూడికి చెందిన డ్రైవర్లు కొటారి వీరబాబు, గుత్తుల దుర్గారావులపై కేసు నమోదు చేశామని, వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

బుధవారం లైసెన్స్ రద్దు చేసినా..

తాటిపర్తిలోని నాగదుర్గా ఏజన్సీస్‌కు 30 టన్నుల యూరియా రాగా, దానిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో వ్యవసాయాధికారి సత్యనారాయణ బుధవారం తనిఖీలు చేసి దగ్గరుండి ఎమ్మార్పీ ధరలకు విక్రయించడంతోపాటు లైసెన్స్ రద్దు చేశారు. అయినా లెక్క చేయకుండా యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం గమనార్హం.



దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలపై ఆరా తీస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

అందుబాటులో యూరియా : కలెక్టర్

కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలను గురువారం పరిశీలించారు. ఇటీవల యూరియా సరఫరాపై రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు రైతులతో సమావేశమయ్యారు. వివిధ పంటల్లో యూరియా వాడకం,పంటల దిగుబడులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. జిల్లాలో యూరియా కొరత లేదని,రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. రైతులకు అవసరమైనంత సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. శాస్త్రీయ పద్ధతిలో అధికారులు సిఫారసు చేసిన మోతాదులోనే యూరియా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఎస్ఐ అరెస్టు



కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బు లు వసూలు చేస్తున్న నకిలీ ఎస్ఐను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మేడ్చల్ జిల్లా దూలపల్లి గ్రామానికి చెందిన గాండ్ల సంతోష్ హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఐషర్ వ్యాన్‌పై ఈ నెల 16వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలో ఒక మాల్ వద్దకు వచ్చి వాషింగ్ పౌడర్ లోడ్ దిగుమతి చేసి వెళుతూ కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్టలోని జియో పెట్రోల్ బంకు వద్ద నిద్రకు ఉప క్రమించాడు. 17వ తేదీ ఉదయం ధవళేశ్వరం ఎఫ్‌సీఐ గొడౌన్స్ ప్రాంతం లోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సరేళ్ళ సంజయ్‌రాజు హోండాషైన్ బైక్‌పై పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ డ్రెస్ వేసుకుని చేతిలో మ్యాన్‌ప్యాక్ పట్టుకుని వచ్చి రోడ్డు ప్రక్కన వ్యాన్ ఎందుకు ఆపావు. రికార్డు చూపించమన్నాడు. రికార్డు చూసి సరిగాలేదని డ్రైవర్ సంతోష్‌ను బెదిరించి స్టేషన్‌కు పద అని కొంత దూరం తీసుకెళ్లి రూ.2 వేలు నగదు తీసుకుని డ్రైవర్‌ను వదిలిపెట్టి కొవ్వూరువైపు వెళ్లిపోయాడు. వ్యాన్ డ్రైవర్ సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.డీఎస్పీ దేవకుమార్, సీఐ కె.విజయబాబుల పర్యవే క్షణలో నకిలీ ఎస్ఐ సంజయ్‌రాజును గురువారం పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. సంజయ్‌రాజుపై గతంలో రాజమహేంద్రవరం-1,3 రాజానగరం, రావులపాలెం, శ్రీకాకుళం, ఏఆర్ పురం ప్రాంతాల్లో పలు కేసులున్నట్టు సమాచారం.

వాడపల్లి ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు



ఆత్రేయపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాలకు చైర్మన్లను ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు విధేయుడిగా ఉన్న ఆత్రే యపురం గ్రామానికి చెందిన మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజును నియామకానికి బండారు కృషిచేశారు.అక్టోబరు 10 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించే స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందే ధర్మకర్తల మండలి కొలువుదీరనుంది. 17 మంది ధర్మకర్తలతో నూతన పాలక వర్గం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులతో ఏర్పడుతుందని చెబుతున్నారు. మంచి ముహూర్తం నిర్ణయించుకుని పాలక మండలి ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించనున్నారు.

ఎన్ఎంఎంఎస్ రెన్యువల్‌కి 30 వరకూ అవకాశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) 2021, 2022, 2023, 2024 డిసెంబరు 8న జరిగిన పరీక్షల ద్వారా ఎంపికైన విద్యార్థులు www.scholarships.gov.in పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 30 వరకూ గడువు పొడిగించడం జరిగిందని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. ఈ ఏడాది 10, ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లోని విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యక్షా..విన్నారా!



- అసెంబ్లీలో తూరుపు వాణి
- గొంతెత్తిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- క్వశ్చన్ అవర్‌లో అవకాశం
- టిడ్కో ఇళ్లు ఇవ్వాలి : గోరంట్ల
- సొసైటీలపై నిఘా ఉండాలి : వాసు
- సోలార్ స్కీమ్ ఉపయోగం : బత్తుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆం ధ్రజ్యోతి) : అధ్యక్షా..! మా సమస్యలివీ పరిష్క రించాలంటూ జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యే లు గొంతెత్తారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభమైన గురువారం జిల్లా నుంచి ము గ్గురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లభించింది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమ హేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ క్వశ్చన్ అవర్‌లో పలు సమస్యలు లేవనెత్తారు. ఎవరెవరు ఏం మాట్లాడారంటే..

సూర్యఘర్‌కు బ్యాంకర్లు సహకరించడంలేదు!

సోలార్ విద్యుత్ ప్రాజెక్టు చాలా మంచిది. దీని వల్ల కాలుష్యం కంట్రోల్ అవుతుంది. కానీ ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల సూర్యఘర్ పథకం ముందుకు వెళ్లడంలేదు. నా నియోజకవర్గంలో 98 వేల ఇళ్లు ఉండగా కేవలం 180 రిజిస్ట్రేషన్లే జరిగాయి. ప్రత్యేక టీమ్‌లతో ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ స్కీమ్ అమలుకు బ్యాంకర్లు సహకరించడం లేదు. లబ్ధిదా రులకు రుణాలివ్వడానికి ముందుకు రావడంలేదు. ప్రభుత్వం బ్యాంకర్లతో చర్చించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాలకు ఉచిత స్కీమ్‌లో సోలార్ విద్యుత్ కల్పిస్తే,విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది.

- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే రాజానగరం

టిడ్కో ఇళ్లను కేటాయించండి



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో 5 లక్షల టిడ్కో ఇళ్లలో 2.5 లక్షల ఇళ్లను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని.. గతంలో చంద్రబాబు ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన మరో 2.5 లక్షల ఇళ్లలో ప్రస్తుతం 50 వేల మంది కూడా నివసించడం లేదన్నారు. నేను టిడ్కో ఇళ్ల పరిశీలనకు వెళ్లినప్పుడు రెండు పెద్దపెద్ద పాములు ఆ ఇళ్లలోకి వెళ్లాయి.మరో పక్క జగన్ హయాంలో ఆ ఇళ్లపై తీసుకున్న రుణాల వల్ల బ్యాంకర్లు ఇళ్లకు తాళాలు వేసుకుంటున్నారని.. కనీసం ఇంట్లోకి వెళ్లకుండానే లబ్ధిదారుల కు బ్యాంక్‌లు నోటీసులిచ్చి ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, బ్యాంకర్లతో మా ట్లాడి..ఇళ్లకు తాళాలు వేయ కుండా చూడాలని కోరారు.తక్షణమే సంబంధిత మం త్రిగారు స్పందించి వసతులు కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యల వివరాలన్నీ రికార్డు చేయాలని,వాటికి పరిష్కారం చూపవలసిన అవసరం ఉం దన్నారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇది మంచి సూచనగా చెప్పడం గమనార్హం. జీఎస్టీ తగ్గింపుపై కూడా మాట్లాడారు.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే రాజమహేంద్రవరం రూరల్

సొసైటీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి



మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీల్లో డబ్బులు దాచుకుని చాలా మంది మోసపోతున్నారని.. ఇటువంటి వాటిపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలి.జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ వల్ల రాజమహేంద్రవరం, కాకినాడలలో అనేక మంది అనేక మంది మోసపోయారు. సొసైటీలపై ప్రభుత్వం ఆడిట్‌గానీ, తనిఖీలు కానీ చేసే అధికారం లేనందువల్ల ఎవరికి వారు సొంతంగా ఆడిట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పేద , మధ్య తరగతి ప్రజలు ఎక్కువ వడ్డీ ఆశతో ఇటువంటి సొసైటీలు, బ్యాంకుల్లో పెడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు.ఇటువంటి సొసైటీల లెక్కలను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేసేలా సంబంధిత మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పుల వల్ల స్పెషల్ విజిట్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియన్ హై కమిషన్ ఆయనను ఆహ్వానించి, అరుదైన గౌరవం ఇచ్చింది. 2001 లో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీకి మాత్రమే ఈ అరుదైన గౌరవం దక్కింది.

- ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే, రాజమహేంద్రవరం సిటీ



పెద్దేవంలో బాధిత రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చిత్రంలో ఆర్డీవో రాణిసుస్మిత తదితరులు

పెద్దేవంలో గేదెల రక్షణకు చర్యలు

- మరికొన్ని ల్యాబ్‌లలో పరీక్షలు
- తాగునీటిపై నివేదిక ఇవ్వండి
- కలెక్టర్ కీర్తి చేకూరి

తాళ్లపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని చూడి పశువులు, ఈనిన గేదెలను గుర్తించి యుద్ధప్రాతిపదికన వాటిని కాపాడాలని పశు సంవర్ధక శాఖా సిబ్బందికి కలెక్టరు కీర్తి చేకూరి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెల వరుస మరణాలపై కలెక్టర్ స్పందించి గురువారం జమ్ముల శ్రీను, గెడ్డం మణికంఠ నివాసాల వద్ద వ్యాధి బారిన పడిన గేదెలను పరిశీలించి రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో పశువులకు చికిత్స కొసాగింపు కొనసాగుతుందని.. ఈ మేరకు ప్రత్యేక వైద్య బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిందన్నారు. గేదెల వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని.. రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బి.కోలి, పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. మరికొన్ని ల్యాబ్‌ల నుంచి రెండు మూడు రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. పశువైద్య జీవ విజ్ఞాన పరిశోధన సంస్థ (వీబీఆర్ఐ) ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో పశువుల చికిత్సవ్యాధి తీవ్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్షించడం జరిగిందన్నారు. పెద్దేవంలో బుధవారం రైతు జొన్నలగడ్డ సత్యనారాయణకు చెందిన గేదె మృతి చెందగా గురువారం శవ పరీక్షలు చేపట్టి.. నమూనాలను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ పంపించారన్నారు.చనిపోయిన గేదెల యజమానుల నివాసాల వద్ద.. గ్రామంలో నీటిని క్షుణ్ణంగా పరిశీలించి రేపటిలోగా నివేదికలు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నూర్జహాన్‌కు సూచించారు. అనంతరం రైతులు ప్రభుత్వం నుంచి గేదెల కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలోని సుగంధి చెరువు శుభ్రం చేయించాలని కోరగా కలెక్టరు పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో రాణీ సుస్మిత, వీబీఆర్ఐ విజయవాడ కేంద్రం జేడీ డా చంద్రమౌళి, సహాయ సంచాలకులు డా.శిరీష, జిల్లా పశుసంవర్ధక శాఖా అధికారి డా. శ్రీనివాస్, డిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంగిడిలోనూ వ్యాధి లక్షణాలు

కొవ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలంలో ఇటీవల పాడిగేదెలు బి.కోలి, పొట్ట జలగ వ్యాధితో మృతి చెందుతున్నాయని, అవే లక్షణాలు కొవ్వూరు మండలం పంగిడిలో కనిపిస్తున్నాయని తెలియడంతో పరిశీలించడం జరిగిందని కలెక్టర్ కీర్తి తెలిపారు. విజయవాడకు చెందిన పశువైద్య జీవ విజ్ఞాన పరిశోధన సంస్థ (వీబీఆర్ఐ) బృందంతో వ్యాధి తీవ్రత, చికిత్సకు సంబంధించి సమీక్షించామన్నారు.జేడీ డా.చంద్రమౌళి ఆధ్వర్యంలో శవ పరీక్షలు చేపట్టామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : డీఎస్పీ



గోపాలపురంలో పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న దేవకుమార్

గోపాలపురం,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతానని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తపరిచారు. అలాగే వినాయకచవితి ఉత్సవాల్లో గోపాలపురం మండల పరిధిలో ఎటువంటి సంఘటనలు జరగకుండా సమర్ధవంతంగా నిమజ్జనాలు నిర్వహించినందుకు ఎస్‌ఐ మనోహర్‌ను అభినందించారు. ఈయనతోపాటు దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్, తదితర సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పోతవరం పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట లక్ష్మి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం పోతవరం పీహెచ్‌సీలో మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఏ కూరగాయలు, ఏ పండ్లు తీసుకుంటే మనిషికి కావాల్సిన పోషకాలు అందుతాయో వివరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందిస్తున్న పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయురాలు కాంతకుమారి

నల్లజర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దూబచర్ల హైస్కూల్‌లో 1984-85వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి, ప్రస్తుతం గుండుగోలను హైస్కూల్‌లో గణిత టీచర్‌గా పనిచేస్తున్న ముత్యం కాంత కుమారి మంచి మనసును చాటుకున్నారు. తాను చదువుకున్న స్కూల్ విద్యార్థులకు రూ.15వేలు విలువ చేసే క్రీడా దుస్తులను గురువారం అందించారు. హెచ్‌ఎం సుమతి ఆధ్వర్యంలో వీటిని అందించారు. అలాగే గతంలోనూ కంప్యూటర్, ప్రింటర్, ఇన్వర్టర్ అందించి స్కూల్ అభివృద్ధికి కృషిచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొందల శ్రీనివాసరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎలకల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి కే.కమలరాజు

దేవరపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటను కాపాడుకోవడానికి సామూహిక ఎలకల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖాధికారి కమలరాజు రైతులకు సూచించారు. దుద్దుకూరులో గురువారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖలాధికారులు, గ్రామ వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కమలరాజు మాట్లాడుతూ వరిచేలులో సాధారణంగా 15 నుంచి 30 శాతం ఎలకల వల్ల నష్టం జరుగుతుందని, దీని జీవనశైలి గురించి రైతులకు వివరించారు. ఒక జత ఎలకలు ఒక సంవత్సరంలో 2067ను పుట్టిస్తాయని కాబట్టి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సంజన, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్



కే.సావరంలో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కే.సావరం, వేలివెన్నులో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. కే.సావరంలో డాక్టర్ బీ.దుర్గామహేశ్వరరావు ఆధ్వర్యంలో 121 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు అందజేశారు. డాక్టర్లు ఆర్. ఉషాదేవి, సృజన, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, కే. సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు కే. సుభాషిణి, సీహెచ్ మేరీరత్న కుమారి, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్త్రీలు తప్పనిసరిగా క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి హరిచందన పేర్కొన్నారు. యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి హరిచందన తెలిపారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయడం జరిగిందని, కిషోర బాలికలకు రక్తహీనతకు పరీక్షలు నిర్వహించామని వీరికి పౌష్టికాహారం నెలసరి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ క్యాంపులో చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు సంబంధించి డాక్టర్ అరుణ్ కుమార్ పరిక్షలను నిర్వహించారు. టీడీపీ నాయకులు నుదురుమాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని గ్రామీణ ప్రాంతాల్లో ఈ వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారి ప్రశాంత్, గ్రామ సర్పంచ్ ఎస్.వరప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు నుదురుమాటి శ్రీనివాస్, యర్రగొల్ల అంజిబాబు, అనిశెట్టి శ్రీనివాస్, వల్లూరి వీరపండు, కురుకూరు రాంబాబు, అంకెం దేవీప్రసాద్, అనిశెట్టి వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు

వేలివెన్నులో మహా పోషణ్ కార్యక్రమాలు



మహిళలకు బాలామృతం కిట్లు అందజేస్తున్న డాక్టర్ ఇర్ఫాన్

ఉండ్రాజవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలివెన్నులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మహా పోషణ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు సృజన, ఇర్ఫాన్ మాట్లాడుతూ బాలామృతం కాంప్లిమెంట్ ఫీడింగ్‌లో పురుషులను కూడా చేర్చడం వల్ల తండ్రీ, బిడ్డకు అనుబంధం పెరుగుతుందని వివరించారు. అలాగే ఊబకాయం వల్ల వచ్చే అనర్థాల గురించి వారు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలసరస్వతి మాట్లాడుతూ అక్టోబరు 16 వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కే. సుభాషిణి, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన

అనపర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వైజ్ఞానికంగా అభివృద్ధి చెందేందుకు ఇండస్ట్రియల్ విజిట్లు ఉపయోగపడతాయని వృత్తి విద్యా సంస్థ ఉపాధ్యాయుడు కే. వినోద్‌కుమార్ అన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గురువారం అనపర్తిలోని రామారెడ్డి జడ్పీ పాఠశాల విద్యార్థులు దుప్పలపూడిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, టీచర్లు నాగార్జున, వీవీ నాయక్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

● తహశీల్దార్ కార్యాలయాల ఎదుట వీఆర్‌ఏల ధర్నా



తహశీల్దార్ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కొవ్వూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని కోరుతూ వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు వర్ధనపు గంగయ్య మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 18,19 తేదీల్లో వీఆర్‌ఏల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 20వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద, 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామన్నారు. 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంలో వీఆర్ ఏలు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు. వీరికి కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్, కారుణ్య నియామకాలు వంటి సమస్యలను పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం సెక్రటరీ టీ.సతీష్, కోశాధికారి కే.సూర్యచంద్రరావు, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: జీతాలు పెంచాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు ఆందోళన చేశారు. గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ చాలీచాలని జీతంతో బతుకుతున్నామని వారంతా వాపోయారు. ఆందోళనలో జీ. జగన్నాథం, కాకరపర్తి సత్తిపండు, మానే నారాయణ స్వామి, గంటి వెంకట దుర్గా రామకృష్ణ, రాచర్ల విఠల్ బాబు, ఈర్లగడ్డ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, పే స్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘ నాయకులు తిప్పర్తి నాగ అంజనేయులు, కొల్లు వెంకట్రావు, తణుకు శంకరరావు, కాకరపర్తి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా

● 12వ పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

కొవ్వూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత సమ్మె కాలపు 17 రోజుల వేతనాలను తక్షణం చెల్లించాలని, 12వ పీఆర్‌సీని ప్రకటించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కొవ్వూరు శాఖ అధ్యక్షులు భూపతి రవీంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి విజయ విహార్ సెంటర్ మీదుగా అల్లూరి సీతారామ రాజు విగ్ర హం వరకు నినాదాలు చేస్తూ కొనసాగించారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఎం. సుందరబాబు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ గడువు పూర్తయి రెండేళ్లయిన కారణంగా 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలన్నారు. గత సమ్మెకాలపు 17 రోజులకు జీతాలు చెల్లించాలన్నారు. అలాగే దహన సం స్కారాలకు రూ. 15 నుంచి 20 వేలు పెంచుతామని, ఎక్స్‌గ్రేషియా రూ. 5 నుంచి 7 లక్షలకు పెంచాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమ లు చేయాలని, పర్మినెంట్ కార్మికులకు డీఏ బకాయిలు, సరెండర్ లీవులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు అందజేస్తామని ఇచ్చిన హామీలపై జీవోలు విడుదల చేసి తక్షణం అమలు చేయాలన్నారు. దశాబ్దాల తరబడి మున్సిపాల్టీలలో పనిచేస్తున్న కార్మికులకు రూ. 21 వేల వేతనం అందించాలన్నారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో పూజారి వాసు, కారింకి దుర్గాప్రసాద్, రాజశేఖర్, రాజేంద్ర, ఏ.వెంకటలక్ష్మి, ఎం.వరలక్ష్మి, ఏ.వాణి పూర్ణ, కే.తిరుమల, టీ.సాయమ్మ, కే.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

షోలాపూర్ ఉల్లికి నో ఎంట్రీ



- రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలో కిలో రూ.11కు కర్నూలు ఉల్లి విక్రయాలు
- మరో వారం పరిస్థితి ఇంతే
- హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర పాయలు కిలో రూ.15-రూ.16



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో మహారాష్ట్ర షోలాపూర్ ఉల్లిపాయల విక్రయాలు నిలిపివేశారు. వీటికి బదులుగా కర్నూలు రకం ఉల్లిపాయలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కర్నూలు ప్రాంత ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో జిల్లాలోని రైతుబజార్ల ద్వారా వీటి విక్రయాలు చేపడుతున్నారు. కర్నూలు పాయలకు మార్కెట్ కోసం అన్ని రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లి విక్రయాలను పూర్తిగా నిలిపివేశారు. కర్నూలు రకం ఉల్లిని రైతు బజార్లలో కిలో రూ.11కే విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలో రూ.10కే విక్రయించారు. వాస్తవానికి జిల్లావాసులు మహారాష్ట్ర ఉల్లిపాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. రేటు రూపాయి ఎక్కువైనా మహారాష్ట్ర ఉల్లినే కొంటారు. మహారాష్ట్ర ఉల్లితో పోల్చితే కర్నూలు ఉల్లి రంగు, నాణ్యతలో అంతంతమాత్రం కావడమే దీనికి కారణం. దీంతో రైతు బజార్లలో రెండు రకాలు పెడితే కర్నూలు ఉల్లికి మార్కెట్ ఉండదనే కారణంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నో ప్రాఫిట్-నో లాస్ తరహాలో రైతుబజార్లలోని వ్యాపారులు ఈ ఉల్లిని విక్రయిస్తున్నారు. లాభం లేకపోవడంతో ఉల్లి వ్యాపారుల్లో కొంత అసంతృప్తి ఉన్నా అమ్మాల్సిందేనంటూ పై అధికారుల నుంచి ఒత్తిడి ఉండడంతో నోరు మెదపడం లేదు. మహారాష్ట్ర ఉల్లిపాయల ధర బహిరంగ చిల్లర మార్కెట్లలో రూ.25-30 ఉంది. తోపుడు బండ్లు, ఆటోల్లో ఇళ్లకు తీసుకొచ్చి విక్రయించేవాళ్లు మీడియం రకాలను ఆరు కిలోలు రూ.100కు ఇస్తున్నారు. కర్నూలు ఉల్లి తక్కువ ధరకే దొరికినా సాధారణ, దిగువ మధ్య తరగతి ప్రజలు ఒకటి, రెండు కిలోల కంటే ఎక్కువ కొనుగోలు చేయరని, మధ్య తరగతి, సంపన్న వర్గాలు మహారాష్ట్ర ఉల్లిపాయలనే కొంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హోల్‌సేల్‌లో మహారాష్ట్ర నెం.1 ఉల్లిపాయలు కిలో రూ.15-రూ.16

హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర నెం.1 పాయలు కిలోరూ.15, రూ.16 ఉన్నాయి. వీటిని బహిరంగ మార్కెట్లో చిల్లర వ్యాపారులు రూ.25-30 వరకు అమ్ముతున్నారు. సెకండ్, థర్డ్ క్వాలిటీ కూడా హోల్‌సేల్‌లో తక్కువ ధరకే దొరుకుతున్నాయి. కిలో రూ.12-రూ.13కే దొరుకుతున్నాయి. ఇవి పాత ఉల్లిపాయలు, ఆరుదల పాయలు కావడంతో వినియోగదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో మహారాష్ట్ర రకం ఉల్లిపాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మహారాష్ట్రలోని షోలాపూర్, నగర్ తదితర ఐదు జిల్లాల నుంచి ఇక్కడి మార్కెట్లకు ఉల్లి వస్తుంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజూ 500 టన్నుల డిమాండ్ ఉంటుందంటే మహారాష్ట్ర ఉల్లి డామినేషన్ అర్థమవుతుంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనే దాదాపు 300 టన్నుల డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెప్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు లేవు. దీంతో మహారాష్ట్ర నుంచి నేరుగా రాజమహేంద్రవరం, జిల్లాలోని ఇతర మార్కెట్లకు వచ్చే ఉల్లిపాయలను లోకల్‌గానే వినియోగిస్తున్నారు. ఒకప్పుడు రాజమహేంద్రవరం ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్‌కు కేరాఫ్‌గా ఉండేది. కాలక్రమేణా ఉమ్మడి తూర్పులో ఎక్కడికక్కడ మార్కెట్లు పెరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, ప్రత్తిపాడు, బూరుగుపూడి, రావులపాలెం, కొత్తపేట, అమలాపురం ప్రాంతాల్లో ఉల్లి హోల్‌సేల్ మార్కెట్ పుంజుకుంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో కర్నూలు ఉల్లిపాయలు దాదాపుగా నిలిచిపోతాయని... పులివెందుల, మైదుకూరు రకాలు ప్రారంభమవుతాయని చెప్తున్నారు. ఈ రకాలు ఎన్ని వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గే అవకాశం లేదనే చెప్పాలి. దీంతో ధరలు కూడా దిగివచ్చే అవకాశం లేదు. అయితే ఉల్లిపాయలను 4 శాతం విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి మహారాష్ట్ర వ్యాపారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని, దీనివల్ల ధర కొంచెం పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు చెప్పారు. ఎగుమతులు 15 శాతం అయితే ధరలు కాస్త పెరిగే అవకాశం ఉందన్నారు.

ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరగాల్సిన మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశారని, నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తారని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు.

విజ్జేశ్వరంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరిగే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని దళిత ప్రజావేదిక వ్యవస్థాపకుడు చోళ్ల రాజు అన్నారు. గురువారం విజ్జేశ్వరంలో దళిత ప్రజావేదిక ఆధ్వర్యంలో అమృత హెల్త్ కేర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు సమాజ సేవలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సుమారు 75 మందికి ఈఎన్‌టీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మేడవరపు భద్రం దొర, బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి, చిన్నం మురళీకృష్ణ, హీరాలాల్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో ఆహారం పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆకుల గిరిజ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె కుటుంబ సభ్యులు సత్యసాయి నిత్యాన్న సేవా పథకం ద్వారా రోగులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివ రామహరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, కోశాధికారి గుంటుపల్లి సత్యసాయి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ వీడియోల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'జస్టిస్ ఫర్ ఆల్ త్రో ది లెన్స్ ఆఫ్ లీగల్ ఎయిడ్' అనే అంశంపై జాతీయ ఫొటోగ్రఫీ, ఆర్ట్ షోకేస్ ప్రారంభించారని, ఈ పోటీల్లో పాల్గొనేవాళ్లు అక్టోబరు 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. న్యాయ సహాయ సేవల పరిధి, ప్రభావాన్ని సృజనాత్మకంగా ప్రజల ముందుకు తీసుకెళ్లడం ఈ పోటీల ముఖ్యోద్దేశమని చెప్పారు.

సమిశ్రగూడెంలో వరుస దొంగతనాలు

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమిశ్రగూడెంలో బుధవారం రాత్రి రెండు చోట్ల దొంగలు పడి నగదు, బంగారం దోచుకుపోయారు. డీ.కొండమ్మకు చెందిన ఇంట్లో సుమారు రూ. 80 వేల నగదు, రెండు కాసుల బంగారు వస్తువులు, రెండు జతల వెండి పట్టీలు, కాలువగట్టుపై ఉన్న టీ షాపులో 20 వేల నగదు దోచుకుపోయారని బాధితులు సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేటకు చెందిన గట్టున సత్యవతి (55) అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. గురువారం మధ్యాహ్నం సత్యవతి సోదరి దేవి ఫోన్ చేయగా స్విచ్ఛాప్ అయ్యి ఉండటంతో సమీప బంధువైన కూనపురెడ్డి గంగారత్నం చెప్పగా, ఆమె వెళ్లి చూసేసరికి బాత్‌రూమ్ సమీపంలో రక్తపు గాయాలతో సత్యవతి పడి ఉందని దేవికి సమాచారమిచ్చింది. దీనిపై దేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాళ్లపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏఈ శ్రీనివాసరావు విషయాన్ని గురువారం వెల్లడించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో తాళ్లపూడి, కుకునూరు, ప్రక్కిలంక, పోచవరం, తుపాల కులగూడెం, రాగోలపల్లి, వేగేశ్వరపురం, పైడిమెట్ట, గజ్జరం, పెద్దేవంకు విద్యుత్ ఉండదన్నారు. కాగా, వ్యవసాయ రంగానికి ఉదయం నాలుగు గంటల నుంచి ఎనిమిది వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఏఈ శ్రీనివాస్ కోరారు.